





# వార్త

ఆదివారం

10 సెప్టెంబరు, 2023

# ఆశలపై నీళ్లు..

# బతుకులో కన్నీళ్లు

# శర్వానంద్ సినిమాలో సీరత్ కపూర్?



**శర్వానంద్** శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్ వివేక్‌కూచిబొట్ల ఈ సినిమా నిర్మిస్తున్నారు. శర్వానంద్‌కి జోడీగా కృతిశెట్టిని తీసుకోగా, ఆమెతో పాటు ఇప్పుడు మరో కథానాయికగా సీరత్ కపూర్ కూడా నటించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఆమెది ఒక కీలకమైన పాత్ర అని సమాచారం. సీరత్‌కపూర్ గతంలో 'రన్ రాజా రన్' సినిమాలో శర్వానంద్‌తో నటించింది. 'ఖుషీ'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## తారాతీరం



**యాక్షన్** హీరో గోపీచంద్ ప్రస్తుతం 'భీమ' అనే యాక్షన్ సినిమా చేస్తున్నారు. కన్నడ దర్శకుడు ఏ.హర్ష తెరెక్కిస్తున్న ఈ సినిమాని కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇందులో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. దీని తరువాత కామెడీ యాక్షన్ సినిమాల దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఆకట్టుకునే

# శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్!

కథా కథనాలతో గోపీచంద్ మార్క్ యాక్షన్‌తో పాటు శ్రీను వైట్ల మార్క్ ఎంటర్టైన్‌మెంట్ అంశాలు కలగలిపిన కథగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సమాచారం. మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కించిన 'అమర్ అక్బర్ ఆంటోనీ' చిత్రం తరువాత శ్రీను వైట్ల ఐదేళ్ల అనంతరం గోపీచంద్ సినిమా ద్వారా దర్శకుడిగా రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో నటించనున్న ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త

10 సెప్టెంబరు, 2023

## మంచి ముత్యాలు

బాహ్యంగా ప్రదర్శింపబడే ప్రేమ కాక అంతర్గతంగా వుండే ప్రేమాభిమానాలే మనకు అవసరం.

- తిరుక్కురళ్

## విషయ విశేషం

భలే పొదరిల్లు.... 4

'సంఘీ'భావం....5

ఎన్నికల వేళ ఓటరు కార్డులు పదిలం

కవర్ స్టోరీ..6

ఆశలపై నీళ్లు..
బతుకులో కన్నీళ్లు

సుగంధాల రాణి మొగలిరేకులు..11

ఈవారం కవిత్వం..12

అక్షర దర్పణం..!

యూరప్‌లో చర్చిల శిల్పకళ...14

కథ.. 20

తీరని కోరిక

సాహిత్యం..23

'బాపు' కళాప్రతిభ

ఆదివాసీల ఆత్మగౌరవ సూచిక 'పచ్చబొట్టు'...25

సెప్టిక్ ట్యాంక్ ఏ దిక్కులో ఉంటే మంచిది?...29

ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### పిక్నిక్‌లోనూ వేడివేడిగా తిందాం



ఇంట్లో ఉన్నప్పుడైతే చల్లారిన పదార్థాలను కావాలనుకున్నప్పుడు ఓవెన్‌లో వేడిచేసుకుంటాం. అదే ఒకటి రెండు రోజులు కార్లలో ఎక్కడికైనా ప్రయాణం పెట్టుకున్నప్పుడూ లేదా కుటుంబమంతా కలిసి సరదాగా ఏ పిక్‌నిక్ వెళ్లాలనుకున్నప్పుడూ వంటకాలను వేడివేడిగా తినడం అన్నిసార్లూ కుదరకపోవచ్చు. దీన్ని గుర్తించే నిపుణులు 'పోర్టబుల్ అవెన్'ను అందుబాటులోకి తెచ్చారు. బ్యాగు మాదిరి కనిపించే ఈ అవెన్‌తోపాటు కేబుల్ కూడా వస్తుంది. దాన్ని కారుకు కనెక్ట్ చేసుకుంటే ప్రత్యేక టైమర్‌ను పెట్టుకుని ఆహారాన్ని వేడిచేయడంతోపాటు చిన్నచిన్న వంటకాలనూ చేసుకోవచ్చు. గాజు, సిరామిక్, ప్లాస్టిక్, లోహం ఇలా ఏ పాత్రనైనా ఇన్సులేషన్‌తో తయారుచేయడం వల్ల పదార్థాల్లో తేమ, రుచి తగ్గడం వంటి సమస్యలు ఎదురుకావు.

---

### జోక్స్..జోక్స్..

తల్లి: ఎవరైనా ఇంటికి వస్తే 'రండి..రండి. ఇలా కూర్చోండి, మంచినీళ్లు తాగండి' అని మర్యాదలు చేయాలి తెలిసిందా!
కూతురు: అలాగే అమ్మ
తల్లి: అదేంటి మీ మేనమామ అలా వచ్చి, సీరియస్‌గా వెళ్లిపోతున్నాడు? నేను చెప్పిన మర్యాదలు చేశావా?
కూతురు: 'ఆ..మనింటి వైఫై చెప్పి, ఫోన్ ఛార్జింగ్ పెట్టుకోండి.. ఏం తింటారు? ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తా' నన్నాను. అమాయకంగా చెప్పింది కూతురు.
తల్లి: అదేంటి నేను చెప్పిన మర్యాద ఇది కాదుకదా!
కూతురు: 'అవి పాత రోజులమ్మా..ఈరోజుల్లో ఇదే మర్యాద' అంది కూతురు.

...

టీచర్: అమ్మకు, భార్యకు తేడా ఏమిటిరా?
స్టూడెంట్: అమ్మ చందమామను చూపిస్తూ తినిపిస్తే భార్య చుక్కలు చూపిస్తూ అన్నం తినకుండా చేస్తాది మేడమ్!

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com









# భలే పొదరిల్లు

ఎవరికైనా అత్యంత ఇష్టమైన ప్రాంతం ప్రదేశం ఇల్లే. ఇంటి గురించి ఎన్ని ఊహలు, ఇంకెన్ని కలలనీ ఏ అందమైన ఇంటిని చూసినా అలాంటి ఇల్లు ఒక్కటుంటే చాలు ఈ జీవితానికి అని అనుకోని వాళ్లెవరూ అలాగని నచ్చిన ప్రతి ఇంటినీ కొనుక్కోలేము. కట్టుకోలేమూ అయితే ఆ నమూనా మినియేచర్‌ని మన పొదరింట్లో అందంగా అలంకరించుకోవచ్చు. మన ఇంటిని ఇలా కళారూపంగా తీర్చిదిద్దవచ్చు. సన్నిహితులకు ఆత్మీయులకు కానుకలు గానూ ఈ మినియేచర్ హౌసెస్‌ను ఎంచుకోవచ్చు. వీటి డిజైన్స్‌ను బట్టి ధరలు ఉన్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్లోనూ అందుబాటులో ఉన్నాయి.








# 'సంఘీ' భావం



## ఎన్నికల వేళ ఓటరు కార్డులు పదిలం

త్వరలో శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్నాయి. 18 సంవత్సరాలు దాటిన ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన ప్రభుత్వాలు ఏర్పడేందుకు ప్రయత్నించడం కనీస బాధ్యత. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు వెంటనే కొత్తగా ఓటరు కార్డును నమోదు చేసుకోవాలి. అదేవిధంగా గతంలో కార్డు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదు సరిచూసుకోవాలి. కొన్ని కారణాల వల్ల ఓటరు జాబితాలో పేరు కనిపించకపోవడం, వేరే ప్రాంతాలకు బదిలీ కావడం వంటి ఘటనలు జరుగుతుంటాయి. సాంకేతికపరమైన కారణాలు కొన్ని అయితే రాజకీయ ఎత్తుగడల్లో కొందరు ఓటరు జాబితాను తారుమారు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చివరి క్షణంలో ఓటరు జాబితాలో పేరు లేదని బాధపడటం కంటే ముందుగానే ఒకసారి పరీక్షించుకోవడం మంచిది. ప్రస్తుతం డిసెంబరు నెలలో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. వచ్చే మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. మే నెలలోనే తెలంగాణ లో కూడా పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం తాజాగా జమిలి ఎన్నికల జరుగుతాయని ప్రచారం జరుగు తోంది. కొన్ని అడ్డంకులు ఉన్నా వాటిని అధిగమిస్తే డిసెంబరు, జనవరి నెలలో ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ కారణంగా ఈసారి ఎన్నికలు అత్యంత కీలకంగా భావించవచ్చు. ఈ సమయంలో ఓటరు తమ ఓటు హక్కునువినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో గంపగుత్తగా ఓట్లు గల్లంతు అయినట్లు తెలుస్తోంది. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయ ఓటర్ల సేవా పోర్టల్ (ఎన్‌విఎస్‌పి)లో లాగిన్ అవ్వడం ద్వారా తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తెలుసుకో వచ్చు. అదేవిధంగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ కూడా అందు బాటులో ఉంది. ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేరు, చిరునామా వివరాలు నమోదు చేయడం ద్వారా గాని, ఓటరు ఐడిని నమోదు చేయడం ద్వారా గాని జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోంది. మున్సిపల్, మండల కార్యాలయల్లో గాని, మీసేవ కేంద్రాల్లో గాని తమ ఓటరు వివరాలను సేకరించవచ్చు. ఓటర్ల జాబితాలో పేరు కనిపించకపోతే వెంటనే కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఎన్నికల సమయా నికి కార్డును కలిగి ఉండే అవకాశం కలుగుతుంది. అదేవిధంగా ఓటరు కార్డులో ఎద్దైనా లోపాలు, తప్పిదాలు ఉంటే వాటిని వెంటనే సరిచేసుకోవడం ఉత్తమం. ఓటర్లు తమకు సమీపంలోని ఎన్నికల కార్యాలయాన్ని సందర్శించడంగాని, జాతీయ పోర్టల్ ద్వారా గాని మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఓటరు ఐడి దిద్దుబాట్లు ఉంటే ఫారం 8ని పూరించి సంబంధిత సహాయక పత్రాలతో పాటు నింపిన ఫారమ్‌ను ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు నేరుగా ఇవ్వడం గాని, ఆన్‌లైన్ పోర్టల్ లో సమర్పించడం గాని చేయవచ్చు. దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సిఇవో) అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. "know the voter id status"ను ఎంచుకోవడం ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఎన్‌విఎస్‌పి పోర్టల్‌లో హోమ్ పేజీలో ట్రాక్ అప్లికేషన్‌ను ఎంచుకోవాలి. అప్లికేషన్ నెంబరు లేదా ఎపిక్ (ఇపిఐసి) నెంబరును భర్తీ చేయాలి. అదేవిధంగా పేరు, పుట్టిన తేదీ, లింగం, రాష్ట్రం, తండ్రిపేరు, జిల్లా, నియోజకవర్గం వంటి వివరాలను నమోదు చేసి శోధనను క్లిక్ చేస్తే ఓటరు కార్డు ఏస్థాయిలో ఉందన్న వివరాలు తెలుస్తాయి. ఓటరు కార్డు మంజూరు చేసినట్లు ఉంటే కనీసం 30 రోజుల్లోగా కార్డు పోస్టు ద్వారా మీరు సూచించిన చిరునామాకు అందుతుంది. లేకపోతే ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఓటరు ఐడీ కేవలం ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు మాత్రమే కాకుండా వ్యక్తిగత ఐడి కింద కూడా పనిచేస్తుంది. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు వంటివి పొందడానికి ఉపయోగపడుతుంది. ఈ కార్డులో ఫోటో, సంతకం, పుట్టిన తేదీ, చిరునామా వంటివి ఉండటం వల్ల ఈ కార్డు పలు సందర్భాల్లో ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఈ కార్డుకు భారత ప్రభుత్వ గుర్తింపు ఉండటం వల్ల అధికారికంగా దీనిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఓటరు కేవలం ఒక చిరునామాతో ఒక కార్డును మాత్రమే పొంది ఉండాలి. అంతకు మించి కార్డును కలిగి ఉంటే నేరంగా పరిగణించే అవకాశం ఉంటుంది. చాలామంది తమ స్వగ్రామంలో ఒక కార్డును, పనిచేసే నగర ప్రాంతాల్లో మరో చిరునామాతో కార్డును పొందుతున్నారు. ఇలాంటి వాటిని ఎన్నికల అధికారులు పరిశీలనలో తొలగిస్తుంటారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని కేవలం ఒక కార్డు మాత్రమే పొంది ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పోలింగ్ తేదీ నాడు మధ్యాహ్నంలోగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రయత్నించాలి. ఆలస్యం జరిగితే ఓటు గల్లంతు కావడమో, వేరొకరు వేయడమో వంటి ఇబ్బందులు ఎదురౌతాయి. ఓటు వేసే సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దు. కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా వ్యవహరించి తమ ప్రాంతాన్ని చిత్తశుద్ధితో కృషి చేసే అభ్యర్థికి ఓటు వేసి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం కల్పించాలి. తాము ఎవరికి ఓటు వేశామన్న విషయం వేరొకరితో పంచుకోవాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ఆశలపై నీళ్లు.. బతుకులో కన్నీళ్లు



కవర్ స్టోరీ

**జంధ్యాల శరత్‌బాబు**

ఆత్మహత్య, ప్రాణత్యాగం, బలవన్మరణం.. పేరు ఏదైనా తీరు మాత్రం 'తనను తానే కనుమరుగు చేసుకోవడం!' అనగానే, వినగానే, చదవగానే, రాస్తుండగానే అసలు ఒక మాటగా అనుకోగానే గుండె తల్లడిల్లుతుంది. తలపుతోనే దడ పుట్టించే ఇది కొంత మందికి తప్పనిసరి ఎందుకవుతోంది? ఎవరి ప్రాణాన్ని వారే తీసేసుకునేంత పరిస్థితి ఏ కారణం వల్ల దాపురిస్తోంది? ఈ రెండూ నాటికీ నేటికీ అంతుపట్టని ప్రశ్నలు. వీటికి సమాధానాలు ఎవరివి వారివే, ఎక్కడివి అక్కడే. 'నీ ప్రాణం నువ్వే తీసుకో' అని ఎవరూ చెప్పరు. సమ్మతం అని ఏ మతమూ చెప్పదు. చట్టం ఎంతమాత్రం ఒప్పుకోదు. సమాజం ఏ విధంగానూ హర్షించదు, అసలే అంగీకరించదు. అయినా అంతటా గంట గంటకీ ఆత్మహత్యలు జరిగిపోతూనే ఉన్నాయంటే ఏమనాలి! చర్చోపచర్చలు ఇంకా కొనసాగుతున్నాయి. పరిశీలనలు, పరిశోధనలు తమ పని తాము చేస్తూనే ఉన్నాయి. శాస్త్రవేత్తల ప్రయోగాలు ఎప్పటికప్పుడు సరికొత్త అంశాల్ని వెల్లడి చేస్తూనే వస్తున్నాయి. అభిప్రాయాలు, ఆందోళనలు, స్పందనలు, నిర్ధారణలు, ముందస్తు హెచ్చరికలు సరేసరి. అన్నీ కళ్లముందు కనిపిస్తున్నా 'కనుమరుగు' ఆగడం లేదు. తరచి చూస్తే, లోతుపాతుల్ని గమనించగలిగితే ఎన్ని దృశ్యాలో... ఇంకా ఎన్నెన్ని అదృశ్యాలో!

కానీ తొందరపాటుతనం ఒకటుంటుంది కదా. అదే శాసించేలా వ్యవహరిస్తోంది. కాలం, జీవితాల విలువను తెలియనివ్వదు. ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే చాలు.. నిండు ప్రాణం నిలుస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, మానసిక ఆరోగ్య సమాఖ్య ఇదే చెప్తున్నాయి. ఆత్మహత్యల నిరోధానికి ప్రత్యేకించి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాటై దశాబ్దాలవుతోంది. ఈ అన్నింటి ఉమ్మడి కృషితో ఏటా సెప్టెంబరు 10వ తేదీన అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ రోజునే ఎందుకంటే ప్రపంచ స్థాయి తీర్మాన సందర్భం కాబట్టి. ఇరవై ఏళ్ల క్రితమే పలు దేశాల సంబంధిత సంస్థలు ఒక్కటై ఆత్మహత్యల నిరోధక వ్యూహాన్ని రూపొందించాయి. వివిధ అంశాల క్రోడీకరణ ఫలితాలను వెలువరించాయి. వాటి ప్రకారం:

➤ ప్రాణం తీసుకోవాలని నిర్ణయించుకున్న వ్యక్తి ఆలోచనలను కొన్ని గంటల ముందే మనం కనిపెట్టవచ్చు. అతడి/ఆమె ప్రవర్తన (మాటలు, చేతలు) అటువంటి సూచనలు చేస్తూనే ఉంటాయి. ఆత్మవిశ్వాసం కొరవడటం, చదువులో వెనకబడి ఉండటం, తల్లిదండ్రులకు భారమవుతామన్న బాధ, పరువు పోతుందన్న భయాందోళన, చిరకాలం వేధించే ఆర్థిక సమస్యలు, ఎంతకీ తేలని వివాదాలు, వివాహేతర సంబంధాలు, వ్యసనాలకు డబ్బు చాలకపోవడాలు, కుటుంబ పరమైన చికాకుల తీవ్రత, కష్టనష్టాల ఊబిలో కూరుకుపోవటం, తన మీద తనకు/ఇతరుల పైనా నమ్మకం లోపించడం; అనుమానాల-అవమానాల ఫలితాలు సైతం ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి.

స్వీయ హాని.. అంటే తనకు తానే అపకారం చేసుకోవడం. ఇదొక అపక్రియ. నిజానికి మనిషి జీవితమే ఉపకార, అపకారమయం; మంచి-చెడుల ఆలవాలం. కాలచక్రంతో పోటీ పడుతున్నట్లు ఉంటాయి ఇవి. అంటిపెట్టుకున్నట్లు గోచరిస్తుంటాయి.

కాలమైనా ప్రాణమైనా తిరిగొచ్చేవి కావు. అందుకే పదిలం చేసుకోవాలి, చూసుకోవాలి.

➤ ఎటువంటి బలవత్తర కారణం లేకుండా, ముందస్తుగా సూచనమాత్రంగానైనా తలపు రాకుండా అప్పటికప్పుడే విపరీత భావోద్వేగ రీతితో ప్రాణహాని చేసుకునేవారూ కొందరుంటారు. ఇదంతా తొందరపడే తత్వానికి మరొక కోణం. దీనికి మానసికంగానే కాక సామాజిక అనిశ్చిత రీతి కారణం. ఇటువంటివాళ్లు ఎక్కడా నిలకడగా ఉండరు. దేని మీదా కనీస ఆసక్తి చూపరు. ఆవేశం, ఆక్రోశం ఎక్కువ.

➤ ఒంటరితనం కోరుకోవడం, ఎటువంటి ఉత్సాహమూ ఏ సందర్భంలోనూ చూపకపోవడం, ఆలోచనలతో మగ్గిపోవడం, నిరాసక్తిగా వ్యవహరించడం, ఇంకా కొన్ని ప్రవర్తనా రీతులు వ్యక్తి ఆత్మహత్య యోచనను వెల్లడి చేస్తూనే ఉంటుంటాయి. చిన్నతరహా అప్పగింతలు, మరణం గురించిన సంభాషణ చేయడం, అటువంటి ఆడియోలు వినీ, వీడియోలు చేసే ప్రయత్నాలన్నీ సంకేతాలని తోటివారు గ్రహించగలగాలి. నిశితంగా పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలి.

'తనను తాను తొలగించుకున్న' రీతి..

భర్త ఫోన్ ఎత్తలేదని, సినిమాకు తీసుకెళ్లలేదని,పుట్టినింటికి వెళ్లనివ్వలేదని.. ఇలాంటి కారణాలతో ఆత్మహత్య చేసుకున్న భార్య అంటూ పత్రికల్లో వరస వార్తలొచ్చాయి. అదే విధంగా.. భార్య వాదించిందని, కోరినకూర వండలేదని, షాపింగ్ ఎక్కువగా చేస్తోందని.. నిండు ప్రాణం తీసుకున్న భర్త అని ఈ మధ్య కూడా వార్తలు వెలువడ్డాయి. ఈ కారణాలన్నీ ఒక పట్టాన నమ్మేవిగా కనిపించవు. ఇంత మాత్రానికే ఉసురు తీసుకోవాలా? అని అనిపిస్తుంది ఎవరికైనా. అయితే వీటన్నింటి వెనకాల మూలకారణం క్షణికావేశం ఒక్కటే కాదు, అపనమ్మకమూ ఉంటుంది. గత ఆగస్టు నెలలో నోయిడా ప్రాంతంలోని నివాస భవనం ఏడో అంతస్తు పైనుంచి కిందికి దూకి దంపతులు చనిపోయారు. అతను వాచ్‌మెన్. కొన్నేళ్లుగా అదే భవనంలో భార్యతో పాటు ఉంటూ విధులు నిర్వర్తించేవాడు. ఒక రోజున ఏమైందో ఏమోగానీ ఇద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. జంట హత్యల మాదిరే జంట ఆత్మహత్యల ఉదంతాలూ సామాజిక భద్రతా రంగాన్ని కుదిపేస్తున్నాయి. అంతెందుకు.. తెలుగునాట పోయిన నెలలోనే వృద్ధ జంట చేతులారా ప్రాణాలు



తీసేసుకుంది. ఒక చిన్న విషయంలో కుమారుడితో వచ్చిన గొడవ దీనికి కారణమని పోలీసులు తేల్చారు. అది ఒక సంఘటనగా మనకు అనిపించినా, పూర్వాపరాలు ఎన్నో ఉంటాయన్నది వాస్తవం. విశ్లేషించి చూస్తే మానసిక, శారీరక, సామాజిక, ఆర్థిక, కుటుంబ పరమైనవి ఎన్నెన్నో.

## ఉదాహరిస్తే ఎన్నో గాథలు..

నానాటికీ మరింతగా తీవ్ర ఆందోళన రేపుతున్నవి పిల్లల ఆత్మహత్యలు. రాజస్థాన్‌లోని కోటా ప్రాంతంలో వసతి గృహాల్లో బలవన్మరణాలు. చదువులు, పరీక్షల ఒత్తిళ్ల తట్టుకోలేక విద్యార్థుల వరస ఆత్మహత్యలు అక్కడ పరిపాటి. అందుకని హాస్టళ్ల గదుల్లోని సీలింగ్ ఫ్యాన్లకు స్ప్రింగ్ డివైస్ అమరుస్తున్నారు అధికారులు. ఫ్యాన్ మీద ఇరవై కిలోలకన్నా ఎక్కువ బరువు వేస్తే, స్ప్రింగ్ వెంటనే దిగువకు సాగిపోతుందన్న మాట. ఈ సమాచారం చదువుతుంటేనే హృదయాలు ద్రవిస్తాయి ప్రతీ ఒక్కరికి.

యువతలోని వెత

పెళ్లి కావడం లేదన్న వ్యథతో ప్రాణాలు తీసుకుంటున్న యువతీ యువకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇదంతా నిరాశల దుష్ఫలితమని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఈ మధ్య వెల్లడించింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు అందరినీ నిర్ఘాంతపరుస్తున్నాయి. అటువంటి ఆత్మహత్యలు కేవలం మానసిక దుర్బలత్వ ఫలితాలు కాదు, అంతకు మించి నిస్సహాయ స్థితిగతుల పర్యవసానాలని శాస్త్రవేత్తలు విపులీకరిస్తున్నారు. గృహహింస మూలాన ఉసురు తీసుకుంటున్న వనితల సంఖ్య క్రమేపీ ఎక్కువవుతోంది. సగటున రోజుకు అరవై, అలాగే ప్రతీ ఇరవై నిమిషాలకీ ఒక ఆత్మహత్య చోటు చేసుకుంటోందని భారత ప్రభుత్వ అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. కట్నం వేధింపులు, కుటుంబ సభ్యుల హింసాత్మక పోకడలు గృహిణిల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. వనితలకు సహజంగానే ఓపిక ఎక్కువైనా దానికీ హద్దంటూ ఉంటుంది. అణచివేత తీవ్రతరమైనప్పుడు ఇక జీవించడం ఎందుకంటూ అటువంటి కఠోర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు సమగ్ర విశ్లేషణ చేపడితే మరెన్నో నిజాలు వెలుగు చూస్తాయని క్లినికల్ సైకాలజిస్టులు విపులీకరిస్తున్నారు. సూసైడ్ నోట్, వీడియోలు వెల్లడి చేసే వాస్తవాలు మరెన్నో. వాటిని రాయడంలో, రికార్డు చేయడంలో నూతన పరిణామాలెన్నో ఇటీవలి కాలంలో సంభవించాయి. "మిమ్మల్ని విడిచి వెళ్తున్నందుకు క్షమించండి" అంటూ కుటుంబ సభ్యులను క్షమాపణ కోరిన ఒక యువకుడు "నన్ను మోసగించిన వ్యక్తులను చట్టం కఠినంగా శిక్షించాలి" అని డిమాండ్ చేశాడు కూడా. అంతిమ చర్యగా ఆత్మహత్యను ఆశ్రయిస్తారన్నది ఇటువంటి వాటితో ప్రస్ఫుటమవుతోంది.

## హృదయ విదారక చరితలెన్నో!

మైనర్ పిల్లల బలవన్మరణాలు సమాజానికి మరింత ఆందోళనకరంగా పరిణమిస్తున్నాయి. ఒక బాలిక తన మిత్రురాలితో కలిసి తీగెల వంతెన మీద నడుస్తూ ఒక్కసారిగా పై నుంచి చెరువులోకి దూకటం గడిచిన జులైలో జరిగిన సంఘటన! తన ప్రేమను ఇంట్లోవారు సమ్మతించకపోవడంతో ఈ దుందుడుకు నిర్ణయానికి వచ్చిందని పోలీసుల దర్యాప్తులో తేలింది.

(తీగెల వంతెన నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నవారు అంతకుముందు ఆరుగురు ఉన్నారు). తెలిసీ తెలియని వయసు, చిన్నపాటి సమస్యలైనా తట్టుకోలేని మనసుతో పిల్లలే ప్రాణాలు తీసుకుంటున్న వైనం మనల్ని జలదరింపచేస్తుంది.



పిల్లలు, పెద్దలతో పాటు కొన్ని ప్రభుత్వ శాఖల్లోనూ విపరీత స్థితిగతులు! సెలవులు మంజూరు కావడం లేదనో, పదోన్నతులు ఆలస్యమయ్యాయనో, బాసిజం పెచ్చుమీరుతోందనో కలవరపడి తమను తాము తుపాకీతో కాల్చుకున్న సాయుధ రక్షణ సిబ్బందీ ఉన్నారు. విధి నిర్వహణకు వినియోగపడాల్సిన ఆయుధం చివరికి ఆ వ్యక్తి ఆత్మహత్యకి కారణమవుతోందన్న మాట. గత కొన్నేళ్లలో 1530 మంది పైగా ఆ విధంగా ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ ప్రకటించింది. వృత్తి/ఉద్యోగ పరమైన పనిఒత్తిడిని భరించలేకనే అలా బలవంతపు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఒక్క మన దేశంలోనే కాదు, అనేక ఇతర దేశాల్లోనూ ఆత్మహత్యల నివారణకు మార్గాల అన్వేషణ జరుగుతోంది. అనారోగ్య పీడ, ఆర్థిక సంక్షోభం, పలు విధాల విద్వేషాలు, రాజకీయ అస్థిరతలు, నిర్లక్ష్యానికి గురవటం, మోసపోవడం, మతిస్థిమితం లోపించడం, వ్యసనాలకు బానిస కావడం, ఇంకా ఎన్నెన్నో స్థితిగతులు బాధితుల తుది నిశ్చయానికి కారణమవుతున్నాయి. ఉరి వేసుకోవడం, ఒంటికి నిప్పంటించుకోవడం, నీళ్లలో మునిగిపోవడం, పురుగుమందు తాగడం, విష ప్రసరణ సూదిమందుల అందుబాటు.. ఇవన్నీ మార్గాలవుతున్నాయి. అపరిమిత కోరికలు, ద్వేషం వంటి మానసిక రుగ్మతలు, దిక్కుతోచని వైనం తమ ప్రాణాన్ని తామే హరించుకునేలా చేస్తున్నాయి. కుంగుబాటు వేళల్లో 'చనిపోయి ఏం సాధిస్తావు?' అని ప్రశ్నించినా వ్యథితులకు కర్ణకఠోరంగానే వినిపిస్తుంది. 'ప్రాణంతో ఉంటే చాలు' అంటూ హితవు చెప్తే 'జీవితం మీద ఆశ కలిగించుకో' అని మదిని నెమ్మది పరిస్తే ఒక్కో మాటా సంజీవని బిందువుగా మారుతుందన్నది మానసిక శాస్త్రకారులం టున్నారు. అవతలి ప్రశ్నలకు ఇవతలి నుంచి సమాధానాలు రావాలంతే! ఉత్తమ కళాదర్శకుడిగా అనేక జాతీయ స్థాయి అవార్డులు సాధించిన ఒకరు ఇటీవల ముంబయి ప్రాంతంలోని తన స్టూడియోలోనే ఉసురు తీసుకున్నారు. అదీ తన పుట్టినరోజు సందర్భానికి కొన్ని గంటల ముందు!



ప్రముఖులైనా, సాధారణ వ్యక్తులైనా ఎవ్వరూ భావోద్వేగాలకు అతీతులు కారు. ఆత్మహత్యకు కొద్ది నిమిషాల ముందైనా ఊరడింపు లభించి, బతికి బయటపడినవారూ కొంతమంది ఉన్నారు.

## సంచలనాల పరంపర

రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యల ఉదంతాలు సంచలనాలే! అవి ఆగాలంటే వారికి ఆదాయ భద్రత కావాలి. వృత్తి పరమైన భరోసా లభించి తీరాలి. రుణ పంపిణీ సంస్థల మాయాజాలంలో పడి నష్టపోయి, చివరికి ఇక ఏ గత్యంతరమూ లేదనుకుని ఈ లోకం నుంచే నిష్క్రమించినవారూ పలువురు ఉన్నారు.

'ఆత్మహత్యలు వద్దు.. నిండైన జీవితం ముద్దు' అనేది నినాద ప్రాయంగా మిగిలిపోకూడదు. శోధించి సాధించాలే కానీ జీవితం మీద అవగాహన ఎంతైనా ప్రసాదిస్తుంది. ప్రాణం తీసుకోవాలన్న ఆలోచన నుంచి తమకు తాముగా బయట పడి, సాటివారిలోనూ అదే స్ఫూర్తిని రగిలించినవారు ఎందరు లేరు. మరణమే శరణ్యమా? కానేకాదు. ఇప్పటి తాజా పరిశీలన అంశాల ప్రకారం ప్రతీ నలభై సెకన్లకీ ఒక బలవన్మరణం జరిగిపోతోంది. అంతేకాదు, ప్రతీ మూడు సెకన్లకీ ఒకరు ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. అటువంటి అందరిలోనూ 'చేతల ద్వారా ఆశలు నింపాలన్నది' ఆచరణకు రావాలి. ఏ పరిష్కారమైనా అందించడంలో కాదు, అవతరించడంలో మాత్రమే ఉండి తీరుతుంది. మనిషికి మనసే సాధనం, ఆయుధం, ఆధారం, సర్వం, సమస్తం, ఆత్మహత్యను నివారించడం అంటే జీవన మకరందాన్ని ఆస్వాదించడం! తాత్కాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం ఆత్మహత్య ఎలా అవుతుందో చెప్పండి మరి. బలాల్ని వినియోగించి, బలహీనతలను అధిగమించి, ముందుకు సాగే వ్యక్తి నిరంతర శక్తి. ప్రపంచ వ్యాప్తంగా అరవైకి పైగా దేశాలు ఆత్మహత్య నివారణ కార్యక్రమాల్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తున్నాయి. బాధితులకు కావాల్సింది నోటిమాటలు కాదు, మనఃపూర్వక చేతలు. సేవ, సహాయం వల్లనే జీవితం మీద ఆశలు పెంచుకుంటారు. ఇప్పటికే అనేక చోట్ల సహాయక కేంద్రాలు తమ వంతు బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. హెల్ప్ లైన్లు, ఫౌండేషన్ చేయూతలు అనేకం. గేట్ వే శిక్షణలు అందుబాటు కావాలి. తనను తాను తొలగించుకోవాలన్న యోచన ఉన్న వ్యక్తిని గమనించి ఆదరించి, అక్కున చేర్చుకోగలిగిన పెద్ద మనసు వెల్లివిరియాలి. పరిశీలక కార్యక్రమాలు, కౌన్సెలింగ్ తరగతులు, చికిత్స విధానాలు బహుళంగా ఉన్నాయి కాబట్టి వాటి గురించి ప్రచారం విస్తృతం కావాలి. మానసిక ఆరోగ్య అవగాహనా సదస్సులు ఊరూరా అవసరమే. సామాజిక కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణవాదులు, సామాజిక హితాభిలాషులు ఉద్యమ స్థాయిన ముందు నిలిస్తే బాధల పెదవుల మీద చిరునవ్వుల పువ్వులు విరుస్తాయి.

## సామాజిక ఆరోగ్య భాగ్యం

'నువ్వు ఒంటరివి కాదని తెలుసుకో' అంటూ స్నేహ హస్తం చాస్తోంది ఆశావహ సమాజం. చేతలతో ఆశలు పెంచేందుకు ప్రపంచ, జాతీయ, ప్రాంతీయ సంస్థలు, వ్యవస్థలు ముందుకొస్తున్నాయి.




గత 2021 సంవత్సరంలో మొదలైన క్రియేటింగ్ హోప్ త్రూ యాక్షన్' ఈ ఏడాదీ కొనసాగుతోంది. ఇన్ని ఆశలు, ఆకాంక్షలు, ప్రయత్నాలు కలిసినప్పుడు ఆత్మహత్యలు లేని సమాజమే ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. అన్ని విధాలా ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమవుతుంది. ఎవరి నినాదమైనా, విధానమైనా ఇదే కదా!

**గణాంకాలతో గుండెదడ**

మనదేశంలోని ఆత్మహత్యల గణాంక సమాచారాన్ని కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిర్వహణలోని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడిస్తూ వస్తోంది. సర్వసహజంగా అది పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగానే ఉంటోంది. బలవన్మరణాలకు కారణాలు, వాటి 'రేట్' విపరీతంగా పెరుగుతున్న తీరుతెన్నులను ప్రభుత్వేతర స్వచ్ఛంద సేవా సంస్థలు తరచుగా వివరిస్తూనే ఉన్నాయి. వాటి ప్రాతిపదికన చూసినప్పుడు, ఆత్మహత్యల సంఖ్యలో భారీ పెరుగుదల ఎంతో ఆందోళన రేకెత్తిస్తోందన్నదే పచ్చినిజం. గత 1971 నుంచి 2021 వరకు అర శతాబ్ద 'పరిస్థితి'ని విశ్లేషించినప్పుడు, బహిర్గతమైన కీలకఅంశాలు ఇవి:

- జనసంఖ్యరీత్యా ప్రతీ దశకీ ఆత్మహత్యల రేట్ 1978లో 6.3 ఉంటే, కేవలం పన్నెండేళ్లకల్లా (1990) అధికంగా 8.9కి పెరిగింది.
- 1980-1990 దశాబ్దకాలంలో అనేకనేక కారణాల వల్ల ఆత్మహత్యలు మరింతగా హెచ్చుపెరిగాయి. మొత్తం అన్నిమూలాలనీ కలిపి గణాంకాలవల్ల ఆత్మహత్యలు మరింతగా పెచ్చుపెరిగాయి. మొత్తం అన్ని మూలాలనీ కలిపి గణాంకాలవారీగా చూస్తే, ప్రతీవెయ్యిలోనూ సంఖ్య (సగటున) 1970లో 43.68, 1992లో 80.15, 2000లో 108,59, 2005లో 113.91, 2010లో 123.6, 2011లో 135.59 ఇలా పెరుగుతూ.. 2021లో 164.03గా ఉంది.

ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్కల ప్రకారం ఏటేటా బలవన్మరణాల సంఖ్య ఏడులక్షలకు పైమాటే. ప్రతినలభై సెకన్లకూ ఒకరు ఏదోఒక కారణంతో ఆత్మహత్యకు యత్నిస్తున్నారనేది దిగ్భ్రాంతిని పెంచే మరొక వాస్తవికాంశం. ప్రత్యేకించి భారత్‌లో ఏటా రైతుల్లోనే 16,000కు పైగా ఆ తరహా మరణాలు నమోదవుతుండటం కఠోరసత్యం. అందుకే ఆత్మహత్యల నివారణ, నిరోధదిశగా గడచిన మూడు సంవత్సరాలుగా (2020,2021,2022) ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు కార్యాచరణ ప్రక్రియ చేపట్టాయి. విపత్కరస్థితి నెలకొన్న దిశలో జింబాబ్వే, వనాటు, ఉరుగ్వే, ఉక్రెయిన్, సురినామ, దక్షిణాఫ్రికా, సోలమనే, రష్యా, దక్షిణకొరియా ప్రాంతాలున్నాయి. మనకు సంబంధించి మహారాష్ట్ర, తమిళనాడుల్లో సంఘటనలు బాధాకరంగా పరిణమిస్తున్నాయి.

**కలకానిదీ, విలువైనదీ..**

'ఆత్మహత్య ఆలోచన ఆపొద్దు' అంటూ దేశంలోని పలు సంస్థలు ముమ్మరప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇదీ సెప్టెంబరు తొలివారంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నమోదైన వివరాలు తలచుకుంటేనే ఎంతో వ్యధ కలిగిస్తాయి. చిన్నపాటి కుటుంబవివాదంతో విసిగివేసారి ఒక ఉద్యోగి తన ప్రాణం తీసుకుని, అదే సమయంలో సెల్ఫీవీడియోను విడుదల చేశాడు. మరణానంతర అవయవదానానికి సంసిద్ధత వ్యక్తపరిచాడు. తీసుకున్న రుణాన్ని తిరిగి వెంటనే చెల్లించాలన్న 'యాప్' నిర్వాహకుల వేధింపులే అతడి బలవన్మరణానికి దారితీశాయని అంతర్గతంగా వినవస్తోంది. చదువులు, పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక ఒక విద్యార్థిని తను ఉంటున్న వసతిగృహంలోనే ప్రాణం తీసుకుంది. అంతకుముందే తండ్రితో ఫోన్‌లో మాట్లాడిన ఆమె ఎంతగానో నిరాశవ్యక్తపరచింది. ఇంతలోనే అంత తొందరపాటు నిర్ణయం తీసుకుంటుందని కలలోనైనా అనుకోలేదని ఆయన గుండెలు పగిలేలా రోదించడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆత్మహత్యకు ముందు నోటు పుస్తకంలో ఆ అమ్మాయి రాసుకున్న వివరాలు ఇప్పటి విద్యావ్యవస్థ డొల్లతనాన్ని బహిరంగపరుస్తున్నాయి. మచ్చుకే ఈ ఉదంతాలు. ఇటువంటివి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొన్నే. ఇంకా ఇటు వంటివి, పోలీసుల రికార్డులకెక్కని ఘటనలు మరెన్నో! ఐకాల్, సూసైడ్ ప్రివెన్షన్, ఆసరా వంటి హెల్ప్‌లైన్ సంస్థలు తమవంతు సామాజిక సేవతో ఆత్మహత్యల నిరోధానికి దోహదపడుతున్నాయి. అవగాహన సదస్సులు, సూచనల విధానాలతో అనేక నిండుప్రాణాల్ని పరిరక్షిస్తున్నాయి. తనకు తాను హానికలిగించుకునే వారితో ఎంత త్వరగా సంభాషణ ఆరంభిస్తే అంత మంచిదని 'రీథింక్' సేవాసంస్థ ప్రకటించింది. అన్నింటికన్న ప్రాణం మిన్న. జీవించు, సాధించు. బతుకు అనేది కల కాదు. కల్ల కాకూడదు. జీవితం ఒక వరం. దాన్ని పొందాలే కానీ, తనకు తానే శపించుకోవటం అసలే వద్దు. అంతా మన చేతుల్లోనే ఉంది. ❑



# నిలబడే నిద్రపోవచ్చు




సాధారణంగా పడుకుని నిద్రపోవడమే మనకు అలవాటు. కొంతమంది బస్సుల్లో ప్రయాణిస్తున్నప్పుడు, ఆఫీసుల్లోనూ కూర్చుని కూడా కునుకు తీస్తుంటారు. జపాన్‌లోని హొక్కాయిడో నగరానికి చెందిన కొయొజు ప్లైవుడ్ కార్పొరేషన్ అనే సంస్థ రూపొందించిన ఈ స్లీపింగ్ పాడ్స్‌లో నిలువునా నిలబడి కూడా కునుకు తీయవచ్చు. 'గిరాఫెనాప్' పేరుతో 8.4 అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల



వెడల్పుతో ఈ స్లీపింగ్ పాడ్స్‌ను రూపొందించారు. ఇది చూడటానికి పాతకాలం టెలిఫోన్ బూత్‌లా ఉన్నా, ఇందులో చాలా సౌకర్యాలే ఉంటాయి. ఇందులో కూర్చుని, డెస్క్‌పై పనిచేసుకోవచ్చు. నిలబడి కునుకు తీయాలనుకుంటే, ఇందులోని ఒక మీట నొక్కితే చాలు కుర్చీ నిలువునా పైకి లేస్తుంది. ఇందులో తలవాల్చుకునేందుకు దిండు కూడా ఉంటుంది. మన ఎత్తుకు తగినట్లుగా దిండు ఎత్తును సవరించుకునే వెసులుబాటు కూడా ఉంది. పని ప్రదేశాల్లో నిద్రపోవడాన్ని అనుమతించే జపాన్‌లో ఇదొక కొత్త ఆకర్షణగా మారింది.

# బూమరాంగ్ గ్రహశకలం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రాయి ఒక గ్రహశకలం. ఇటీవల ఇది సహారా ఎడారిలో దొరికింది. అప్పుడప్పుడు పలుచోట్ల గ్రహశకలాలు నేల మీదకు రాలిపడటం మామూలే! ఇందులో విశేషమేమిటంటారా? ఇది మొట్టమొదటి బూమరాంగ్ గ్రహశకలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రహశకలం ప్రభావం కారణంగా దాదాపు పదివేల యేళ్ల కిందట ఇది భూమి నుంచి విడివడి



అంతరిక్షానికి వెళ్లిపోయిందని, మళ్లీ అక్కడి నుండి నేలమీదకు రాలిపడిందని వారు చెబుతున్నారు. ఈ గ్రహశకలానికి శాస్త్రవేత్తలు 'ఎన్‌డబ్ల్యూఏ 13188' అని పేరుపెట్టారు. దీనిపై ఫ్రాన్స్‌లోని మార్సిలే యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. ఈ శిలలో భూఉపరితలానికి చెందిన పదార్థాలే ఉన్నాయని, ఇది అగ్నిపర్వతానికి చెందిన శిల అని వారు వెల్లడించారు. గ్రహశకలాల అన్వేషకులు కొందరు దీనిని 2018లో మొరాకోలోని సహర ఏడారి ప్రాంతంలో కనుగొన్నారు. ఇది శాస్త్రవేత్తలకు చేరడంతో, వారు దీనిపై సుదీర్ఘ పరిశోధనలు జరిపి, ఇది భూమ్మీద దొరికిన మొట్టమొదటి 'బూమరాంగ్ గ్రహశకలం' అని ప్రకటించారు.

# నలభై కోట్ల గోడ

పురాతన వస్తువులను వేలం పాటల్లో అత్యధిక ధరలకు కొనుగోలు చేయడం మామూలే. కానీ, ఒక సాధారణమైన గోడ అత్యంత ఎక్కువ ధరకు అమ్ముడుపోయి వార్తలకెక్కింది. వాషింగ్టన్ డీసీలోని ఈ గోడ యజమాని పేరు అలెన్‌బర్గ్. ఒకసారి ఈ గోడ పక్కన ఉన్న ఇంటికి నీరు లీక్ అవుతున్నట్లు ఆ ఇంటి యజమాని గమనించాడు. దక్షిణంవైపు గోడకు సరైన నిర్వహణ లేకపోవడం వల్ల దూలాలు తడిసి శిథిలావస్థకు చేరుకున్నాయని ఇంజినీర్ చెప్పడంతో, ఆ యజమాని అలెన్‌ను తన గోడ భాగాన్ని సరిచేయాలని కోరాడు. అతడు అందుకు నిరాకరించడమే కాకుండా, ఆ యజమానితో గొడవపడ్డాడు.



గొడవ పెద్దది కావడంతో ఆ ఇంటి యజమాని సమస్య పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించాడు. కోర్టు అలెన్‌కు కోటిన్నర రూపాయలు జరిమానా విధించింది. దీంతో ఇప్పుడు అలెన్ తనకున్న ఆ ఒక్క ఆస్తి, ఈ గోడను రూ.నలభై కోట్లకు అమ్మకానికి పెట్టాడు. దాదాపు నాలుగేళ్ల పాటు ఎవరూ కొనకపోవడంతో, తన ఇంటిని కాపాడుకోవడం కోసం ఆ పొరుగింటి యజమానే దీనిని కొన్నాడు. ఏదిఏమైనా అలెన్‌కు వాళ్ల తాత ఇచ్చిన ఆ ఒక్క గోడ అతన్ని కోటీశ్వరుడుని చేసింది.



# సుగంధాల రాణి మొగలిరేకులు

**'ముద్దబంతి** పూలు పెట్టి మొగలిరేకులు జడను చుట్టి' అంటూ పాటల్లోనే కాదు.. మొగలి పువ్వు ప్రస్తావన పురాణాల్లోనూ కనిపిస్తుంది. కానీ పూజల్లో వాడరు. విష్ణుమూర్తికి బ్రహ్మదేవుడికీ పెట్టిన పరీక్షలో మొగలిపువ్వు బ్రహ్మదేవుడి తరపున అబద్ధపు సాక్ష్యం చెప్పడంతో, ఆగ్రహించిన శివుడు పూజకు పనికిరావని శపించాడట. అంతట ఆ పువ్వు క్షమించమని వేడుకోవడంతో శివరాత్రి రోజున మాత్రం పూజించవచ్చు అని సెలవిచ్చాడట. అందుకే ఈ పూలకు పెట్టింది పేరయిన ఒడిశాలోనూ ఆ రోజున ఒక్కో పువ్వు 300 నుండి 700 రూపాయల ధర పలుకుతుందట. కేతకి, గంధపుష్ప, కెవడా..ఇలా ఎన్నో పేర్లతో పిలిచే మొగలిపొద..ముళ్ల ఆకులతో వేలాడే వేళ్లతో గుబురుగా చిన్నపాటి చెట్టులా పెరుగుతుంది. ఈ మొక్కలో ఆడామగా వేరుగా ఉంటాయి. మగపువ్వుని కేతకి విఫల, ఆడపువ్వుని స్వర్ణకేతకి అంటారు. మగచెట్టు పువ్వులే సుగంధాన్ని వెదజల్లుతుంటాయి. ఆడచెట్టు పూలు వాసనరావు కానీ పండ్లుగా మారతాయి.

## వెదజల్లే సువాసనలు

మొగలిచెట్టు పొట్ట నుంచి పుష్పించే ఈ పువ్వు సువాసన వంద అడుగుల దూరం వరకూ వ్యాపిస్తుంది. దీని గుబాళింపు మనసుకి ఆహ్లాదాన్నీ నరాలకు సాంత్వననీ అందిస్తుంది. యాంటీసెప్టిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాల్నీ కలిగి ఉండే మొగలిపూల తైలం కీళ్లనొప్పుల్నీ తగ్గిస్తుందట. మధుమేహం, జ్వరం, చెవినొప్పి, మూర్ఛ..ఇలా ఎన్నో వ్యాధుల నివారణలోనూ వాడుతుంటారు ఆయుర్వేద వైద్యులు. ఈ తైలం చర్మవ్యాధుల్నీ శరీర ఉష్ణోగ్రతనీ తగ్గిస్తుందనీ, మానసిక వ్యాధులకు మందులా పనిచేస్తుందనీ చెబుతారు. కెవడా నీటిని క్లెన్సర్‌గానూ వాడతారు. ఈ నీటిని రసగుల్లా, రసమలై..వంటి స్వీట్ల తయారీలోనూ బిర్యానీల్లోనూ వేస్తుంటారు. దేశంలోని పలు ప్రాంతాల్లో మొగలిపొదలు ఉన్నప్పటికీ ఒడిశాలోని గంజాం జిల్లాలోనూ ఒడిశా-ఆంధ్ర సరిహద్దుల్లోని ఇచ్ఛాపురం పరిసరాల్లో ఈ పూలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. అక్కడి తీరప్రాంతపు నేల, వాతావరణం అనువుగా ఉండటంతో ఈ పొదలు సహజంగానే అక్కడ పెరుగు తాయి. సుమారు ఐదువేల హెక్టార్లలో విస్తరించిన నలభై వేల పొదలకి ఏటా కోటికి పైగా పువ్వులు పూస్తే, అవన్నీ అక్కడున్న బట్టీల్లో తైలంగా మారుతున్నాయి. దేశంలోని ఈ పూల ఉత్పత్తులకు అవసరమైన ముడితైలంలో 90శాతం గంజాం నుంచే ఎగుమతి అవుతోంది.



## ఎలా చేస్తారు?

జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనే మొగలిపొదలు బాగా పూస్తాయి. కాబట్టి ఈ కాలంలోనే పూల నుంచి ఎక్కువగా తైలాన్ని తీస్తారు. అందుకోసం పూర్తిగా విచ్చుకుంటే వాసనపోతుందని ఉదయాన్నే పూలను ప్రత్యేకమైన కత్రసాయంతో కోసేస్తారట. తరువాత ఇత్తడి లేదా కంచు పాత్రల్లో 300 నుంచి 500 పూలరేకుల్ని వేసి నీళ్లు పోసి మూతపెట్టి ఐదారు గంటలు మరిగిస్తారు. దాన్నుంచి వచ్చే ఆవిరి ఓ పొడవాటి గొట్టం ద్వారా చల్లని నీళ్లలో ఉన్న కంచుపాత్రలోకి వెళ్లేలా చేస్తారు. ఇలా సుమారు 30వేల పువ్వుల్ని మరిగిస్తేగాని ఒక లీటరు గాఢతైలం రాదు. అందుకే సీజన్‌ను బట్టి దీని ధర రెండున్నర నుంచి తొమ్మిదిన్నర లక్షల రూపాయలు పలుకుతుంటుంది.

కేవలం పువ్వులే కాదు, ఈ ముళ్ల మొక్క ఆసాంతం ఉపయుక్తమే అంటారు స్థానికులు.

ఆకులు, కాండం, వేళ్లలో ఉండే దృఢమైన పీచుతో కాగితాన్నీ చేస్తారు. సంపన్నులకు పరిమళాల్ని పంచుతూ పేదవాళ్లకు పొట్ట నింపుతోన్న మొగలి పొద..ప్రకృతి మనిషికి ప్రసాదించిన గొప్ప ఔషధ సౌగంధం. ❑

# అక్షర దర్పణం..!




పొద్దుటే తలుపు తెర్చేసరికి
గుమ్మాల దగ్గర మూలుగుతుంటావు
రోజూ లాగానే..!/ రాత్రంతా రుధిరాశ్రువుల్లో పొర్లి వస్తావు
కామోసు గాయపడిన పావురంలా
ముడుచుకొని దీనంగా చూస్తుంటావు..
నీ అణువణువూ అంతుతేలని అనంత గాయాలే!
పట్టుకుంటే చేతులంతా రక్తం!/
హత్తుకొంటే మనసంతా తీరని దుఃఖం!
అబలల్ని బలిచేసి అసహాయుల్ని
అణచేస్తోంటే రోదనలు
వేదనలు తప్ప
నువు ఏ
నవ్వులు
నగిషీలు
తీసుకొస్తావు
నరనరాన అవినీతి వ్యవస్థ
జవసత్వాలు
తోడేస్తోంటే నువు ఏ అభివృద్ధి ఆనవాలై
ఎగిరొస్తావు/ త్యాగధనులు తెచ్చిన స్వేచ్ఛాగాలులు
కులమతాల కంపుతో దుర్గంధం వెదజల్లుతోంటే
నువు ఏ పరిమళాలు పట్టుకొస్తావు/ డెబ్బై ఐదేళ్లుగా
నమ్మిస్తోన్న రాజకీయం
గొర్రెల మందని విందు చేసుకొని పసందుగా/
పాలిస్తుంటే నువ్వు రోజుకో శవమై వచ్చి
చావక ఏం చేస్తావ్?
అయినా ప్రతి ఉదయం చూస్తూనే వుంటాను..
నీ కోసం!
ఎప్పటికైనా తళతళలాడే తీవ్రర్ణ పతాకమై
పెళపెళలాడే నా నవభారతాన్ని అందంగా
అద్దుకొని అపురూపంగా మోసుకొస్తావని..
నా కోసం!

**- భీమవరపు పురుషోత్తమ్**

---

## ఈవారం కవిత్వం

# చరవాణి చట్రంలో బాల్యం



'సెల్' పంజర సింగిడిలో
బందీలవుతున్న బాల్యాలు
స్మార్ట్! చేతుల్లో తిష్ట వేసిన
హిత శత్రు ఉపకరణాలు
అంతర్జాల విషవలలో చిక్కి
చితికిపోతున్న చిన్నారులు
నెట్టింట్లో వీడియో గేమ్ క్రీడలు
అశ్లీల అసభ్య వెబ్ సైట్లలో
మునకేస్తున్న లేత చిగురుటాకులు!
స్మార్ట్‌ఫోన్‌కు బానిసలైన
సకల జన ప్రబుద్ధులు
పొద్దస్తమానం నీలి తెరలకు
కళ్లప్పగిస్తున్న నవతరాలు
నట్టింట్లో పోటెత్తుతున్న
హింసాత్మక దృశ్య దుర్గంధాలు
భ్రష్టుపడుతున్న కౌమార బాల్యాలు!
బుజ్జగించి బువ్వ తినిపిస్తూ
ఉసురు తీస్తున్న చరవాణులు
అంతర్జాల మాయ మత్తులో
చాప కింద నీరులా
ఆత్మహత్యల్ని పురికొల్పే
సామాజిక మాధ్యమ నిషాలు
చిత్తవుతున్న చిన్ని మనసులు
ఛిద్రమవుతున్న లేత భవితలు!
కరువైన నైతిక విలువల పునాదులు
పట్టించే లేని ప్రభుత్వ పోకడలు
తీరికే లేని తల్లిదండ్రుల విపరీతాలు
సాంకేతికత వడ్డించిన అశ్లీల లీలలు
మానసిక ఆరోగ్యాలకే పెనుప్రమాదాలు
బాలభారత సమగ్ర వికాసానికి..
ద్వారాలు తెరుచుకునేదెన్నడు!

**- మధుపాళీ**



## మాటలు కావు..అభివృద్ధి బాటలు



ఉప్పల గోపాలరావు (ఉగోరా) ప్రముఖ సామాజిక ఉద్యమనేత. వయస్సు 87 సంవత్సరాలు 'ప్రజా ఆలోచన వేదిక' వ్యవస్థాపకుడుగా ఆరు దశాబ్దాలుగా అవినీతి, అక్రమాలపై నిర్విరామపోరాటం సాగిస్తు, సామాజిక చైతన్యం కొరకు తన శక్తిని, సమయాన్ని ధారపోస్తున్న నిస్వార్థ సేవాతత్పరుడు. ఆలోచనల్ని రేకెత్తించి, స్ఫూర్తిని రగిలించే తన మాటలను మూటలుగా పేర్చి మనకు అందిస్తున్నాడు. నిజానికి అక్షర తూటాలు.

అక్రమార్జన, అక్రమార్జనపరులు, అక్రమార్జన సంస్కృతి..యివి మూడు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారిన మూడు 'అ'లుగా అభివర్ణిస్తున్నాడు. 'పాలన బాగుండాలి, పాలకులు మంచివారై వుండాలి, పాలనా యంత్రాంగం ప్రజలకు నిబద్ధతతో, నిజం పారదర్శకంగా సేవలందించాలి' ఇదీ ఊగోరా వివాదం. ప్రతి వ్యక్తి భయం లేని జీవితం గడపాలన్నదే ఆయన ఆశయం. ప్రజలకు సుపరిపాలన అందాలన్నదే ఆయన వాదం. ఉగోరా మాటల మూటను పరికిస్తే న్యాయం, ధర్మం, చట్టం గెలవాలనీ, అనుభవంగల మేధస్సు మూగబోవద్దనీ గట్టి సందేశం ద్యోతకమవుతుంది. రండి..ఆయన మాటలు విందాం..అభివృద్ధి బాటలో పయనిద్దాం.

**(నా మాటల మూట, రచన: ఉప్పల గోపాలరావు, వెల: అమూల్యం, ప్రతులకు: బ్లాక్-15, ప్లాట్:107, రెయిన్‌ట్రీ పార్క్, మలేషియన్ టౌన్‌షిప్, కెపిహెచ్‌బి, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

## విశ్వమానవ ప్రేమ, దాని ఔన్నత్యం



ఈ ప్రపంచం అంతా ప్రేమమయం. ఏ దేశవాసి అయినా మానవుడే. మానవులంతా ఒకటైనపుడు, పరస్పర వైషమ్యాలు అర్థం లేనివి అన్న సందేశం ఈ వ్యాసం లాంటి పెద్దనవల చెబుతుంది. రచయిత గులాబీల మల్లారెడ్డి జర్నలిస్టు, వృత్తిరీత్యా అడ్వకేట్. ఈ నవల నిండా కవితలు (పేజీలు 14,47, మరియు 100) ప్రపంచ మానవ సంబంధాలు తన తార్కిక దృష్టితో గమనిస్తూ, మనిషి ఎదుగుదలకు ప్రముఖమైన విద్యార్థి దశ్థితిగతుల్ని కేంబ్రిడ్జి (ఇంగ్లాండ్) కేంపస్‌ను నేపథ్యంగా తీసుకున్నారు. దేశదేశ విద్యార్థులు, వారి ఆలోచనలను, పరిణామాల్ని చిత్రించే ప్రయత్నం చేసారు. ఈ నవలను విద్యార్థుల కోరిక మేరకు అజ్ఞాతంగా ఉంచి ఇప్పుడు ప్రచురిస్తున్నారట. పరిణత చెందిన భారతీయుడు. ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నుండి కేంబ్రిడ్జ్ వచ్చిన 'యువ విద్యార్థులు వారివారి దేశాల ఆలోచనలు ముఖ్యంగా దాయాదులమైన పాకిస్థానీయుల ఆలోచనా కోణంలోంచి రెండు దేశాల రాజకీయ సాంస్కృతిక చారిత్రక జీవనాలపై ప్రసరించిన ఎక్స్‌రే కిరణాలుగా ఈ నవలను పేర్కొనవచ్చును. ఈ భూగ్రహం ఒక్క మనుషులకే చెందినది ఎంతమాత్రం కాదు (44) హిందూ మైదాలజీలో పెళ్లి ప్రాముఖ్యత (పే 51) ప్రేమకు ఇచ్చిన నిర్వచనం (పే 64) లాంటి ఆలోచనల్లో రచయితకున్న లోతైన శోధనశక్తి, ముందు చూపు విషయ వివరణ నైపుణ్యం ద్యోతకమవుతుంది.

**(ప్రేమ పవనాలు- మానవతా సౌరభాలు, రచన: గులాబీల మల్లారెడ్డి, వెల: రూ 200, ప్రతులకు: జి.యం, ఆర్ పటేల్, కరీంనగర్)  - కూర చిదంబరం**

**పుస్తక సమీక్ష**

## ఆ నలుగురా..? కథాసంపుటి

ప్రముఖ కథారచయిత బొందల నాగేశ్వరరావు 'ఆ నలుగురా..!?' శీర్షికతో ప్రచురితమైన కథా సంపుటిలో 21 కథలున్నాయి. బాలలకథలు, నాటకాలు, నాటికలు, పాటలు, టీవీ, సినిమా రచయితగా సామాజిక, కుటుంబ నేపథ్యంలో రెండువందల కథలు పైగా రాసిన నాగేశ్వరరావు, కథలు దైనందిన జీవితానికి దగ్గరగా ఉంటాయి. ఆ నలుగురా..? 'మానవత్వం',



దీనులు అనాధల జీవితాల వ్యధను సామాజిక స్పృహతో పరిష్కరిస్తాయి. తాగుడు వ్యసనపరుల జీవితాలలో పరివర్తన కోరే కథ 'నాన్నా! మీరు మాకు కావాలి', 'అదొక పిచ్చిమా లోకం' కథలో పరస్త్రీ వ్యామోహం సృష్టించే దుష్పరిణామం, హాస్య కథగా 'నెరవేరని కోరికలు, ప్రేమపిచ్చి, ప్రేమను పెళ్లిగా మార్చుకోలేని 'మాట మనసు దాటలేదు' వంటి కథలలో మానవ సంబంధాలు వ్యక్తం అవుతున్నాయి. సహజంగా వ్యక్తుల ప్రవర్తనలలో తొంగిచూసే చిన్న, సున్నితమైన పొరపాట్లను వాటిని కథలుగా మలచి, ముగింపులో పరిష్కారం చూపించడంలో రచయిత చాకచక్యం కథలను నడిపిస్తుంది. వాటిని సరిదిద్దుకొని మంచి మార్గంలో నడవడం శ్రేయస్కరమని రచయిత కథారూపంగా సూచిస్తారు. ప్రస్తుత రోజుల కనుగుణంగా, కొడుకుల కోసం నిరీక్షించి చివరకు వీడియోకాల్‌లో చూసి అమ్మానాన్నలు కన్నుమూయడం 'చివరి క్షణాలలో' చిత్రీకరించారు. ఈ సంపుటిలోని కథలన్నీ ఆసక్తికరంగా చదివింప చేస్తున్నాయి. **(ఆ నలుగురా..!?,రచన: బొందల నాగేశ్వరరావు, వెల: రూ 130, ప్రతులకు: సుందరినివాస్, నెం: 31, కొడుంగైయూరు, చెన్నై) - యర్రమిల్లి**

భారతదేశ అమృతోత్సవాల ముగింపు వేడుకల అనంతరం, ఈశాన్యరాష్ట్రంలో అత్యంతఅటవీ ఖనిజ సంపదగల మణిపూర్ నేలలో మైతీలు-కుకీల తెగల మధ్య రిజర్వేషన్ల, భూసమస్యపై పోరాటాలు, పెద్ద ఎత్తున సాగాయి. వందలాది ప్రజలు గాయాలు,

## 'మణిపూర్ మంటలు'



130 మందికిపైగా జనులు మృతి, అల్లర్లు దేశాన్ని ఎంతో కలవరపరిచాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు, కవి, రచయిత ఉద్యమకారుడు జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో అడుగు జాడలు పబ్లికేషన్స్ ఈ పుస్తకం వెలువరించింది. ఇంద్రగంటి లక్ష్మీ హారిత, జ్వాలనారాయణ, డానీ, పాతూరి వేంకటేశ్వరరావు, సీజెఐ జస్టిస్ చంద్రచూడ్ డి.వై, జైనుల్లా ఆబేదీన్ భాష, తంగ్ర ప్రభాకర్‌గౌడ్, కె.ఎన్.మల్లీశ్వరి, చలసాని నరేంద్ర, డా॥కోలాహలం రామ్‌కిషోర్, ఎ. అప్పల్నాయుడు, అనిశెట్టి రజిత, డా॥దేవరాజు మహారాజు, డా॥ కత్తి పద్మారావు, కూనంనేని సాంబశివరావు, కొండూరి వీరయ్య, వద్దెల్లి మురళి, జూలూరు గౌరీ శంకర్, కె.శ్రీనివాస్, కేంద్ర మంత్రి పి.చిదంబరం, ఎ.వి.వి. ప్రసాద్, డా॥కిరణ్ థాపర్, రాజ్‌దీప్ సర్దేశాయిలాంటి ప్రముఖుల అభిప్రాయాలతో కూడిన వ్యాసాలు, ప్రముఖ దినపత్రికల సంపాదకీయాలతో పరిష్కారాలు, సమగ్రంగా విశ్లేషించారు. **(మణిపూర్ మంటలు, సంపాదకులు: జూలూరు గౌరీశంకర్, వెల: రూ 130, ప్రతులకు: తెలంగాణ పబ్లికేషన్స్, మొదటిఅంతస్తు, ఇ.నం.1-1-80/15, ఆర్టీసీ క్రాస్‌రోడ్, ముషీరాబాద్, హైదరాబాద్)  - తంగిరాల చక్రవర్తి**



# యూరప్‌లో చర్చిల శిల్పకళ

షేక్ అబ్దుల్ వాకీం జాని

ప్రపంచంలోని అనేక దేశాలలో ఎన్నో చర్చిలు శిల్పకళసంపదతో విరాజిల్లుతున్నాయి. అటు భక్తులను, ఇటు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. క్రైస్తవుల ప్రార్థనా మందిరాన్ని చర్చి అంటారు. చర్చిలలో బెసిలికా, కెతడ్రల్, చాపెల్ ఇత్యాది రకాలు ఉన్నాయి. పవిత్రమైన వ్యక్తులు నివసించే ప్రాంతంలో నిర్మించే చర్చిలను బెసిలికా అంటారు. నిర్ణయించిన ప్రాంతానికి క్రైస్తవమత గురువుగా వ్యవహరించే బిషప్ చనిపోయినప్పుడు వారి సమాధిపై నిర్మించే చర్చిలనే కెతడ్రల్ అంటారు. కొంతమంది చిన్న సమూహంగా ఏర్పడి వాళ్ల ప్రార్థన చేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ప్రార్థనాస్థలాన్ని చాపెల్ అంటారు. కొంతమంది గృహాలలో సైతం చాపెల్ ఏర్పాటు చేసుకుంటారు. ప్రపంచ క్రైస్తవులు వారి పండుగలకు, పర్వదినాలకే కాక ప్రతి ఆదివారం విధిగా చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తుంటారు. ప్రపంచవ్యాపితంగా ఇలా ప్రార్థనలు చేసే క్రైస్తవ మందిరాలలో కొన్ని అతిపెద్దవికాగా, మరికొన్ని అద్భుత శిల్పకళతో అలరారుతున్నాయి. వాటిలో కొన్ని చర్చిల విశేషాలను తెలుసుకుందాం.

## సెయింట్ పీటర్స్ స్క్వేర్-బసిలికా

ఈ చర్చి ప్రపంచంలోని అతిచిన్న దేశమైన వాటికన్ సిటీలో ఉంది. ఇది పోప్ పాలనలో ఉంటుంది. ఇదొక నగర రాజ్యం. ఇక్కడి జనాభా 900లకు మించదు. వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ బెసిలికా చర్చి లోపలి భాగంలో 693.3 అడుగుల పొడవు, 451 అడుగుల వెడల్పు ఉంటుంది. యేసుక్రీస్తు శిష్యుడైన సెయింట్ పీటర్స్ సమాధిపై ఈ చర్చిని మహాద్భుతంగా నిర్మించారు. సెయింట్ పీటర్స్‌తో పాటు మోజెస్ విగ్రహాన్ని కూడా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. పాత బెసిలికాను క్రీ.పూ.318లో నిర్మించారు. ఆ భవన స్థానంలో నూతన భవన నిర్మాణాన్ని 18 ఏప్రిల్ 1506లో ప్రారంభించి 18 నవంబరు 1626లో పూర్తి చేశారు. ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు, శిల్పి, కవి, ఇంజనీర్ అయిన మైఖల్ ఏంజిల్ తన 24వ ఏట సెయింట్ పీటర్స్ బెసిలిన్ భవన నిర్మాణానికి రూపకల్పన చేసి నిర్మాణరంగంలో ఒక నూతన మార్గానికి తెర తీశాడు. ముఖ్యంగా దీని పైభాగంలో ఉన్నడోమ్‌ను 132 మీటర్ల వైశాల్యంతో రూపొందించినప్పటికీ తన జీవితకాలంలో మైఖల్ ఏంజిల్‌లో పూర్తి చేయలేకపోయాడు. ఈ క్రీస్తుమందిరమంతా ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారుడైన మైఖల్ ఏంజిల్ చిత్రకళతో నిండిపోయిందంటే అతిశయోక్తి కాదు. రాపెల్, ఫ్రాఆంగెలికో వంటి కళాకారులు వాటికన్ అంతర్గత అలంకరణ చేశారు. చర్చిలో అద్భుతమైన 36 గాజు కిటికీలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోనే అనేక చర్చిలలో ఉన్న ఇటువంటి గాజు అద్దాలను జర్మనీ దేశం నుండి తెస్తుంటారు. జర్మనీలో తయారయ్యే ఈ గాజు అద్దాలపై కోరిన చిత్రాన్ని పరమాద్భుతంగా చిత్రీకరించి ఇస్తున్నారు. చర్చిలోనే కేథలిక్ మతాధిపతి అయిన పోప్‌కు ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. అన్ని ఆధునిక సదుపాయాలతోనూ, నవీన హంగులతో దీన్ని నిర్మించారు. ఇందులో ఒకవైపు స్విమ్మింగ్ పూల్ కూడా ఉంది. 16వ శతాబ్దంలో ఇక్కడ పోప్ నివాస భవనాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చర్చిగా, పరమాద్భుత నిర్మాణంగా ఇది ప్రశంసలందుకుంటుంది. ఆ కాలంలోని మహాకళాకారుల్లో ప్రముఖుడైన బెర్నినో చర్చి ఆవరణలో ఎన్నో స్తంభాలపై అనేకమంది మతబోధకుల విగ్రహాలను నిలబెట్టారు.

## వెస్ట్‌మినిస్ట్రీ చర్చి




ఈ చర్చి లండన్ నగరంలో ఉంది. క్రైస్తవ మతశాఖ అయిన ప్రొటెస్టెంట్ మతానుయాయులు నిర్మించిన మధ్యయుగాల చారిత్రక నిర్మాణం వెస్ట్‌మినిస్ట్రీ చర్చి. దీన్నే వెస్ట్‌మినిస్ట్రీ అబే అని కూడా పిలుస్తారు. ఈ చర్చిని క్రీ.శ.7వ శతాబ్దంలో

ఆంగ్లోశ్యాక్సన్ రాజు సెబర్ట్ ప్రారంభించాడు. ఈ నిర్మాణం క్రీ.శ.960 నిర్మించారు. క్రీ.శ.1065లో ఎడ్వర్డ్ అనే అతను దీనికి ఆధునిక హంగులతో నవీన రూపం ఇచ్చాడు. చర్చి ప్రారంభమైన ఎనిమిది రోజులకే ఎడ్వర్డ్ మరణించగా ఈ చర్చిలోనే సమాధి చేశారు. 13వ శతాబ్దంలో హెన్రీ-3 ఈ మందిరం ద్వారా తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేశారు. గోతిక్ శిల్పశైలిలో దీన్ని పునర్నిర్మించారు. ఆ మీదట వందేళ్లకు రిచర్డ్-2 భవన నిర్మాణ నిపుణుడు హెన్రీయెకాల్ ఆధ్వర్యంలో కాంటెర్‌బరీ అనే మఠాన్ని నిర్మించాడు. అతడే లండన్ నగరాన్ని సైతం 1666లో పునర్నిర్మించాడు. ఆ తరువాత 1517లో కూడా జరిగిన పునర్నిర్మాణ కార్య క్రమంలో అనేక మార్పులు చేశారు. 18వ శతాబ్దంలో ఈ చర్చికి 225 అడుగుల ఎత్తులో రెండు టవర్స్ నిర్మించారు. మూడువేల మీటర్ల విస్తీర్ణంలో 85 అడుగులు వెడల్పుతో దీన్ని నిర్మాంచారు. బ్రిటన్ రాచరికపు కుటుంబాలవారు అధికారం చేపట్టేసమయంలో విధిగా ఈ చర్చికి వచ్చి ప్రార్థనలు జరుపుతారు. ఈ చర్చిలో కొన్ని వందల సంవత్సరాల క్రితం బైబిల్ ప్రతి ఉంది. రాచకుటింబు కులు ఇక్కడికి వచ్చిన సమయాలలోనే ఈ బైబిల్‌ను ప్రత్యేక ప్రార్థనాధికారుల ఆధ్వర్యంలో పఠిస్తారు. ఇక్కడికి పర్యాటకులు, భక్తులు రావడానికి మరో విశేషమైన కారణం ఉంది. ఇంగ్లండు రాచరికపు వ్యక్తులు, ప్రముఖ పరిపాల కులు కళాకారుల, కవులు, పండితులు ఇత్యాదివారి 400 సమాధులు ఇక్కడ ఉన్నాయి. వీటిని చూడటానికి సైతం అనేకులు వస్తుంటారు. సర్ విలియమ్‌ను 1066లో ఇక్కడనే సమాధి చేశారు. లండన్‌కే ప్రధాన ఆకర్షణగా భావిస్తున్న వెస్ట్‌మినిస్టీని ఒక ప్రార్థనా స్థలంగానే కాకుండా చారిత్రక నిర్మాణంగా కూడా దీన్ని పరిగణిస్తారు. యునెస్కో వారు దీన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించారు.

## హోలీ సోఫియా కెథడ్రల్ చర్చి

ఐరోపాలో ఉక్రెయిన్ రాజధాని నగరం కివ్‌లో హోలీ సోఫియా కెథడ్రల్ చర్చి నెలకొని ఉంది. కివ్ యూరప్‌లో అతిప్రాచీన నగరం. యూరప్‌లో ఏడవ



అతిపెద్ద జనాభాగల ప్రాంతం. ఓల్పీన్ నది పశ్చిమతీరంలో ఉల్లిపాయ ఆకారం లో ఉండే అయిదు గోపురాలలో క్రీ.శ. 1045-1051 మధ్యకాలంలో సోఫియా కెథడ్రల్ చర్చిని నిర్మించారు. ఇది ఈ ప్రాంతంలో నిర్మితమైన తొలిరాతి ప్రార్థనామందిరం. ఈ నిర్మాణం పొడవు 29.5 మీటర్లు, వెడల్పు 29.3 మీటర్లు, గుమ్మటాల వరకు ఎత్తు 28.6 మీటర్ల ఎత్తుతో నిర్మించారు. బైజాయింటైన్ కళాకారుడు థియోపేన్య దీన్ని రూపొందించాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఈ నిర్మాణానికి నష్టం వాటిల్లింది. అనంతరం దీన్ని పునర్నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం ఉక్రెయిన్ చెందిన వ్యాపారులు, ప్రజా సంస్థలు, విదేశీ క్రైస్తవ సంస్థలు ఇత్యాది వారికి ప్రధాన కేంద్రంగా విరాజిల్లుతుంది.

## మౌంట్ సెయింట్ మైఖేల్ ప్రార్థనామందిరం

ఐరోపాలోనే అపురూప కట్టడంగా విరాజిల్లు తుంది మౌంట్ సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరం. ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరం నుండి నాలుగు గంటలపాటు ప్రయాణం చేస్తే ఈ అద్భుత ప్రార్థనా మందిరాన్ని చేరుకోవచ్చు. ఇది ఒక చారిత్రాత్మక నిర్మాణం, యునెస్కో వారు ప్రపంచ వారసత్వం కట్టడంగా ప్రకటించిన ఈ చర్చిని ప్రతి ఏడాది పాతిక లక్షలమంది ప్రపంచం నలుమూలల నుండి సందర్శిస్తుంటారు. దాదాపు ఒక కిలోమీటర్ దూరానికి కనపడేలా 160 మీటర్ల ఎత్తైన చిన్న కొండపై ఈ భవ్య నిర్మాణం నెలకొని ఉంది. ఐరోపా శిల్పకళా చాతుర్యానికి ఇదో మచ్చుతునక. ఇది రోమన్ క్యాథలిక్ చర్చి. 10వ శతాబ్దంలో లభించిన కొన్ని రాతప్రతుల వల్ల ఈ చర్చికి ఒక కథ ఉంది. దీని ప్రకారం అవ్రాంచెస్ అబర్ట్ అనే బిషప్‌కు క్రీ.శ.708లో ఒక రాత్రి కలలో మైఖేల్ దేవత కనిపించి సమీపాన ఉన్న మౌంట్ శిఖరంపై క్రీస్తు మందిరాన్ని నిర్మించమని ఆదేశించింది. అలా ఈ చర్చి నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అనుకున్నదే తడవు ఈ చర్చి నిర్మాణం జరగలేదు. ఆ తరువాత క్రీ.శ.966లో నార్మండి రాజు రిచార్డ్-1 కొంతమందిని చర్చి నిర్మాణానికై ఈ ప్రాంతానికి పంపాడు. వారంతా ఈ ప్రాంతాన్ని బాగా పరిశీలించారు. చర్చి నిర్మాణం కోసం ఈ కొండపై నిలబడేందుకు వీలుగా పరంజాలు కూడా నిర్మించారు.

వంద చర్చిల నగరం క్రకోవ్

పోలెండ్ దేశరాజధాని నగరం క్రకోవ్. దీన్ని రాళ్ల మాట్లాడే నగరం అని పిలుస్తారు. ఐరోపాలోనే ప్రపంచ వారసత్వ, సాంస్కృతిక తొలి నగరంగా 1978లోనే యునెస్కోవారు గుర్తించారు. క్రవోవ్ నగరంలో వందకుపైగా చర్చిలు ఉన్నాయి. పియాస్ట్ వంశ ప్రభువులు క్రీ.శ.1039లో క్రకోవ్ నగరాన్ని పోలెండ్ రాజధానిగా చేసుకుని పాలించే సమయంలో అద్భుతమైన చర్చిని,



చనిపోయిన ప్రభువుల కోసం ఒక స్మశాన వాటికను నిర్మించారు. ఇక్కడే 1364లో ఒక చక్కటి విశ్వవిద్యాలయాన్ని నిర్మించాడు. పోలెండ్ ప్రాంతంలో ఇదే తొలి విశ్వవిద్యాలయంగా ప్రశంసలందుకుంటుంది. ఖగోళశాస్త్రవేత్త కొపర్నికస్ ఈ విశ్వ విద్యాలయ విద్యార్థి, క్రకోవ్‌లో ప్రధాన కూడలి వద్ద నిర్మితమైన

**(మిగతా 18వ పేజీలో)**





కథ

# తేనెటీగ ఏల కుట్టెనో?

'అమ్మా! ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆడుకుంటూ ఉంటే, గండు తేనేటీగ సరుక్కున కుట్టిందే..' అని పిల్ల ఉడుత ఫిర్యాదు చేసింది అమ్మ ఉడుతకి.

'అయ్యో..దానికేం పోయేకాలం. మనమేమో పార్కులో ఉన్నాము, ఆడుకోవడానికి మీకు అపార్ట్‌మెంట్ సౌకర్యమని అక్కడికి వెళ్తారు' అని బాధపడుతూ గాయమైన చోట ఆకు పూత రాసింది అమ్మ ఉడుత.

ఇంతలో ఓ పిల్లి పిల్ల 'మ్యావ్ మ్యావ్' అంటూ ఏడుస్తూ అక్కడికి వచ్చింది. తేనెటీగ కుట్టిందని తెలుసుకుని అమ్మ పిల్లి, తేనెటీగను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. తేనె తొట్టె నాశనం అయిపోవాలని శాపం కూడా పెట్టింది.

అప్పుడే ఓ కుక్కపిల్ల 'కుయ్ కుయ్' అని అరుస్తూ అక్కడికి వచ్చింది 'అది కూడా తేనెటీగ నిర్వాకమే' అని తెలుసుకున్న అమ్మ కుక్క 'భౌ..భౌ' అని గట్టిగా అరిచింది.

అక్కడే ఉండి అన్నీ విన్న సీతాకోక చిలుకలు ఎగురుకుంటూ వెళ్లి చీమలరాణికి విషయాన్ని చేరవేశాయి. వెంటనే చీమలరాణి పార్కులో సమావేశం ఏర్పాటు చేసింది. అన్నెంపున్నెం తెలియని పిల్లలను కుట్టి బాధించే తేనెటీగ పొగరు అణచాలని, అవన్నీ ఏకగ్రీవంగా తీర్మానించాయి. అపార్ట్‌మెంట్‌లో ఉన్న తేనెతొట్టె వద్దకు వెళ్లి తాడోపేడో తేల్చుకోవాలని భావించాయి.

పార్కులోని పక్షులు, పురుగులు, చిన్నాపెద్దా జంతువులు 'పొలో'మని అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నాయి.

తేనెతొట్టె పెద్ద వద్దకి వెళ్లి 'మా పిల్లలు సరదాగా ఆడుకుంటూ ఉంటే మీ గండు తేనెటీగ కుడుతోందని' ఫిర్యాదు చేశాయి.

'అయ్యో..మానవేతర జీవాలైన మనమంతా కలిసికట్టుగా ఉన్నాము కదా, దానికెందుకు ఈపాదు బుద్ధి పుట్టిందని' కోప్పడుతూ గండు తేనెటీగను పిలిపించింది తేనెతొట్టె పెద్ద.

ఏమాత్రం భయపడకుండా ధైర్యంగా వచ్చి నిలబడింది గండు తేనెటీగ. దానివైపు కోపంగా చూస్తూ చీమల రాణి 'మా పార్కు జీవులంటే నీకు భయంభక్తి లేకుండా పోయింది. మేం తలచుకుంటే నిన్ను నామరూపాలు లేకుండా చేయగలం..'అని గట్టిగా అరిచింది.

అందుకు గండు తేనెటీగ 'మీ చీమల పుట్టలో వేలు పెడితే మీరు కుట్టరా?' అని నిలదీసింది. 'ఎందుకు కుట్టం? కచ్చితంగా కుడ్తాము' అని బదులిచ్చింది చీమలరాణి.

'మరి మీ పిల్లలు మా అపార్ట్‌మెంట్‌లో చేస్తున్న నిర్వాకం ఏమిటి?' అని ఎదురు ప్రశ్న వేసింది.

'ఏముంది..పార్కులో ఉండే మా పిల్లలు మీ అపార్ట్‌మెంట్‌లో వచ్చి ఆడుకుంటున్నాయి. దానిలో తప్పేమంది? అసలు అది మీ సొత్తు కాదు కదా' అని గదమాయించింది చీమల రాణి.

'అవి ఆడుకోవడం తప్పు అని చెప్పడం లేదు. అవి మా మిత్రులు కూడా. అయితే అవి ఆడుకుంటున్నది ఖాళీస్థలంలో కాదు. కార్లు నిలబెట్టే చోట టైర్ల కింద ఆడుకుంటున్నాయి. ఇక్కడ ఉన్నోళ్లంతా పెద్దపెద్ద ఆఫీసర్లు. ఎప్పుడంటే అప్పుడు కార్లు బయటికి తీస్తుంటారు. ఇవి టైర్లకింద ఉండేది చూసుకోకుండా 'దుర్రు' మని బయలుదేరతారు. జరగరానిది జరిగితే అపాయమని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరికగా కుట్టాను. కార్ల కింద కాకుండా మిగిలిన చోట ఆడుకుంటున్న వాటిని నేను ఎప్పుడూ కుట్టలేదు' అని బదులిచ్చింది.

గండు తేనెటీగ చెప్పింది విని మిగిలినవన్నీ ఆశ్చర్యపోయాయి.

'నిజమే! మన పిల్లలు కారు కింద ఆడుకోకూడదు కదా, అలా చేస్తే వాటి ప్రాణాలకే ముప్పు కదా' అని పార్కు జీవాలన్నీ పశ్చాత్తాపపడ్డాయి. ఇంకెప్పుడూ అలా చేయకండని పిల్లలను హెచ్చరించి మంచి చేసిన గండు తేనెటీగకు కృతజ్ఞతలు తెలిపాయి. అన్నీ కలిసి తాజా తేనె తాగి అక్కడి నుంచి కదిలాయి.

**- ఆర్.సి.కృష్ణస్వామి రాజు**







## బాలగేయం

### దిన చర్య



ఉదయాన్నే మేం లేస్తాం
దంతావధానం చేస్తాం
స్నానం శుభ్రంగా చేస్తాం
చక్కగా దువ్వుకుంటాం
ఉతికిన దుస్తులు ధరిస్తాం
వేడివేడిగా భుజించి
వేళకు బడికెళ్తాం
గురువుకు
వందనం చెబుతాం
పాఠాలు చదువుతాం
అందరితో కలసి వుంటాం
బడిని గుడిగా భావిస్తాం
బాధ్యతగా మెలుగుతాం.

**- వైదా ఈశ్వరరావు**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎన్.నారాయణి,** నిడదవోలు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వ్యాయామానికి, యోగాసనాలకు తేడాలు ఏమిటి?**

**జవాబు: నారాయణి!** ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. వ్యాయామం శారీరక శక్తిని వినియోగించుకుంటుంది. యోగాసనాలు శారీరక, మానసిక శక్తులను సంరక్షిస్తాయి. వ్యాయామం చేయడం వల్ల మనలోని శక్తి వినియోగమై(ఖర్చు కాగలిగి), కండలు అవసరం లేని చోట కరిగి, అవసరమైన చోట వృద్ధి చెందుతాయి. యోగాసనలు వేయడం వల్ల శరీరం మన ఆరోగ్యానికి అనువుగా రూపొంది అతితక్కువ శరీర శక్తి వినియోగంతో ఆరోగ్య సంరక్షణ ఏర్పడుతుంది. నియమానుసారం వ్యాయామం చేసేవారు ఆహారం, నీళ్ల అధిక మొత్తంలో తీసుకోవాలి. యోగాసనాలు వేసేవారు సైతం కచ్చితమైన ఆహార నియమాలు పాటించడం శ్రేయస్కరం.

**- పి.పాండురంగ,** వరంగల్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే.ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగురుతూ వుండే రాబందులకు నేలమీది ఆహారం ఆచూకీ ఎలా తెలుస్తుంది?**

**జవాబు: పాండురంగ!** రాబందులు కంటిచూపుతోనే శవాలను గుర్తిస్తాయని తేలింది. కానీ వాటికి వాసన తెలుసుకునే శక్తి పూర్తిగా లేదనడానికి వీలు లేదు. ఆకుల కింద పూర్తిగా కనబడకుండా మూసి వున్న కళేబరాలను అవి గుర్తించి బయటకు లాగినట్లు రుజువైంది. మొత్తం మీద ఆకాశంలో ఎత్తున ఎగురుతూ, బహు శ్రద్ధగా, ఏకాగ్రతతో నేల మీద కళేబరాల కోసం రాబందులు చూస్తూ ఉంటాయి. వాటికి ఎంతో నిశిత మైన చూపు వుంటుంది. ఎత్తుగా ఎగరడం వలన విశాలమైన ప్రదేశాన్ని పర్యవేక్షించ డానికి అవకాశం ఉంది. చాలాసేపు కదలకుండా పడివున్న జంతువు ఏదైనా కనిపిస్తే కిందకి దిగివస్తాయి. నేల మీదకు దిగిన తరువాత బాగా కుళ్లిన మాంసపు వాసనను కూడా ఆధారం చేసుకొని అవి ఆహారాన్ని వెతికి పట్టుకుంటాయి.

## యూరప్‌లో చర్చిల శిల్పకళ

(15వ పేజీ తరువాయి)

సెయింట్ మేరీస్ బెసిలికా చర్చి 80 మీటర్ల ఎత్తులో గంభీరంగా కనిపిస్తుంది. దీన్ని పోలిష్, గోతిక్ శిల్పకళా శైలిలో నిర్మించారు. ఐరోపాలోనే అతిపెద్దదైన మేరీ విగ్రహాన్ని గోథిక్ శిల్పకళారీతిలో తయారుచేసి ఇక్కడ నెలకొల్పారు. నేడు



అత్యాధునిక చర్చిలతో క్రకోవ్ అలరారుతుంది.

### సగ్రడ ఫామిలియా చర్చి

దీన్ని స్పెయిన్‌లోని బార్సిలోనాలో నిర్మించారు. ఇది రోమన్ కాథలిక్ చర్చి. 19 మార్చి 1882లో దీని నిరాగిణం ప్రారంభమైంది. దీన్ని 90 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పు, 170 మీటర్ల ఎత్తులో నిర్మించారు. ఈ ప్రదేశంలో 9వేలమంది కూర్చోవడానికి అనువుగా నిర్మించారు. సగ్రడ ఫామిలియా చర్చిని 1852-1926 మధ్యకాలంలో జీవించిన అంటోనీ గౌడి నిర్మించాడు. అయితే చర్చి పేరు మాత్రం మార్చలేదు. అప్పుడూ, ఇప్పుడూ కూడా సెయింట్ పాల్స్ కెతడ్రల్ పేరుతోనే పిలుస్తున్నారు. ఈ చర్చి 365 అడుగుల ఎత్తులో గంభీరంగా కనిపిస్తుంది. దీనిపైన ఉన్న గుమ్మటం 278 అడుగుల వైశాల్యాన్ని కలిగి ఉంటుంది. ఈ చర్చికి ఒక్కొక్క టవర్ 221 అడుగుల ఎత్తులో ఇరువైపులా రెండు టవర్లు ఉన్నాయి. యేసుక్రీస్తుకు 12మంది శిష్యులు ఉండేవారు. వారిలో ఒకడైన అపోస్తలుడైన పౌలుకి ఈ నిర్మాణాన్ని అంకితం చేశారు.

### నోట్రె డామ్ డి ప్యారిస్ చర్చి

ఈ చర్చి ప్యారిస్ నగరంలో ఉంది. ఫ్రాన్స్ బిషప్ నేతృత్వంలో ఈ చర్చి నడుస్తుంది. క్రీ.శ.1163లో దీని నిర్మాణం ప్రారంభమై 1345లో పూర్తి అయింది. సుదీర్ఘకాలం నిర్మించిన ఈ దివ్య, భవ్య క్రీస్తు మందిరం అద్భుత చిత్రాలతో అలరారుతుంది. ఈ భవనం పొడవు 420 అడుగులు, వెడల్పు 157 అడుగులు. ఈ చర్చికి ఒక్కొక్కటి 226 అడుగుల ఎత్తులో రెండు టవర్లను కూడా నిర్మించారు. దాదాపు పదిగంటలు కూడా ఏర్పాటు చేశారు. 15 ఏప్రిల్ 2019 స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటలకు ఈ చర్చిలో అగ్నిప్రమాదం జరిగింది. కారణంగా శిఖరభాగానికి కొంత నష్టం వాటిల్లింది. ఆ తరువాత ఈ నిర్మాణ మరమత్తులు గావించారు. నోట్రెడామ్ డి ప్యారిస్ చర్చిని



ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కోవారు గుర్తించారు.

### సెయింట్ మార్క్స్ బెసిలికా చర్చి



ఇది ఇటలీ దేశ ఉత్తర వెనిస్ నగరంలో నెలకొని ఉంది. దీని పొడవు 251 అడుగులు, వెడల్పు 205 అడుగులు. ఈ చర్చిపైభాగాన అయిదు గుమ్మటాలు ఉన్నాయి. ఈ గుమ్మటాలు లోపలి భాగం 92 అడుగులు, బయట భాగం 141 అడుగులో ఎత్తును కలిగి ఉన్నాయి. ఇటాలియన్-బైజాయింటైన్ శిల్పశైలిలో అద్భుతంగా దీన్ని నిర్మించారు. సెయింట్ మార్క్స్ బెసిలికా నిర్మాణాన్ని క్రీ.శ.978లో ప్రారంభించి 1092లో పూర్తి చేశారు. దీని లోపలి భాగం బంగారు వర్ణంతో ధగధగలాడుతుంది. గోడలపై యేసుప్రభువు జీవిత చరిత్రకు సంబంధించిన చిత్రాలు అద్భుతంగా చిత్రించారు. ఇలా యూరప్‌లో అనేక క్రీస్తు మందిరాలు అద్భుత శిల్పకళతో అలరారుతూ భక్తజనులతోపాటు పర్యాటకుల్ని కూడా విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ❑

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396,

లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# ఉప్పు ధర 30వేలు





కేజీ ఉప్పు ఇరవై నుంచి ముప్పై రూపాయల మధ్యే ఉంటుంది. కొందరు పింక్‌సాల్ట్, రాక్‌సాల్ట్ అని వాడుతుంటారు. అవి 100-150 మధ్య ఉంటాయి. మరి వేలల్లో-అదీ కేజీ సుమారు రూ. 30,000 ధర పలికే ఉప్పు ఉందని మీకు తెలుసా! అవునా, అంత ధరపెట్టి కొనే ఆ ఉప్పులో ఏముంటుందబ్బా అనుకుంటున్నారా? అయితే ప్రపంచంలోనే ఖరీదైన ఆ ఉప్పు గురించి తెలుసుకోవాల్సిందే. కొరియన్ వంటకాల్లో వాడే ఆ ఉప్పు పేరు బ్యాంబూపిక్ సాల్ట్. వెదురు బొంగుల్లో ఉప్పుని నింపి చివర్లలో బంకమట్టితో మూసేసి-800 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద దాదాపు 15 గంటలపాటు కాల్చుతారు. బొంగులోని ఖనిజ లవణాలూ, దాన్నుంచీ వచ్చే నూనెలూ ఉప్పులో కలిసిపోతాయి. బొంగు బాగా కాలిపోయి ఉప్పు నల్లగా అవుతుంది. దాన్ని మళ్లీ ఇంకో బొంగులో పెట్టి కాల్చుతారు. ఈవిధంగా తొమ్మిదిసార్లు కాలిన ఉప్పునే కొరియన్ బ్యాంబూ సాల్ట్ అంటున్నారు. అలా, నిప్పుల్లో కాలిన ఉప్పు ఆరోగ్యానికి ఎన్నోరకాలుగా మేలని కొరియన్లు నమ్ముతారు. ఉపయోగం, తయారీవిధానం వల్లే దానికంత డిమాండ్ మరి. ❑

# రోడ్లపై టైర్‌కిల్లర్లు


రోడ్లపైన యూటర్న్ వరకూ వెళ్లి మలుపు తీసుకోవడానికి సమయం పడుతుందనో, పెట్రోలు ఆదా చేద్దామనో, త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతోనో చాలామంది రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుంటారు. అలా ప్రయాణించే వాహనదారులు ఇతరులకు ఇబ్బంది కలిగించడంతోపాటు కొన్నిసార్లు ప్రమాదాలకూ కారణమవుతుంటారు. ఈమధ్య అహ్మదాబాద్‌లో రాంగ్‌రూటులో ప్రయాణించిన ఓ వాహనం తొమ్మిదిమంది ప్రాణాలను బలిగొంది. దాంతో ఇలాంటి వాళ్లలో మార్పు తీసుకురావడానికి ట్రాఫిక్ పోలీసులు




రోడ్లపై పైర్‌కిల్లర్లను ఏర్పాటు చేశారు. అంటే ఓ ఇనుప షీటుపైన పదునైన మొనతేలిన బ్లేడులు ఉంటాయి. రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాల టైర్లలో దిగబడి పంక్చరు చేసేలా అమర్చి ఉంటాయి. ట్రాఫిక్ ఎక్కువ గా ఉండే ప్రాంతా ల్లో అక్కడక్కడా ఈ టైర్ కిల్లర్లను ఏర్పాటు చేశారు. అంటే ఓ ఇనుప షీటుపైన పదునైన మొనతేలిన బ్లేడులు ఉంటాయి. రాంగ్‌రూటులో వచ్చే వాహనాల టైర్లలో దిగబడి పంక్చరు చేసేలా అమర్చి ఉంటాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతా ల్లో అక్కడక్కడా ఈ టైర్ కిల్లర్లను ఏర్పాటు చేశారు అధికారులు. మరి టైరు పంక్చ రైనా, పేలినా ఇబ్బందే కాబట్టి వాహన దారులు సరైన దారిలో వెళుతు న్నారు. పథకం ఫలించడంతో గుజరాత్ రాష్ట్రమంతా ఇలాంటివి ఏర్పాటు చేయాలను కుంటున్నారు.

# 44వ అంతస్తులో రోల్స్ రాయిస్

చాలామంది బాల్కనీలో బట్టలు ఆరేసుకుంటారు. కొందరు కాఫీ టేబుల్ వేసుకుని సూర్యోదయం, సూర్యాస్తమయాల్ని ఆస్వాదిస్తుంటారు. కాస్త అభిరుచి ఉన్నవారు రకరకాల కుండీలను ఏర్పాటు చేసి బాల్కనీ అంతటా పచ్చదనం పరిచేస్తుంటారు. అయితే ఎక్కడైనా బాల్కనీలో అదీ 44వ అంతస్తులో కారును పార్కు చేయడం చూశారా? పోనీ విన్నారా? ఊహకు కూడా అందని ఆ దృశ్యాన్ని చూడాలంటే మాత్రం చైనాలోని వూజియాన్ నగరానికి వెళ్లాల్సిందే. రోల్స్ రాయిస్ కొనాలన్నది ఓ వ్యాపారవేత్త కల. గత నెల్లోనే కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఆ కారును అపార్ట్‌మెంట్‌కి తీసుకొచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. కేవలం కొనుగోలు చేసి దాన్ని చూస్తూ మురిసిపోవాలనుకున్న ఆ కోటీశ్వరుడు ఓ ఇంజిరింగ్ సంస్థ సాయంతో దాన్ని 44వ అంతస్తు లోని తన బెడ్‌రూమ్ బాల్కనీలో పెట్టించుకున్నాడు. అందుకయ్యే ఖర్చుతో మరో రోల్స్‌రాయిస్ కూడా కొనొచ్చుట. కారు కొనడం సరే దాన్ని బాల్కనీలో పెట్టడమే కాస్త విడ్డూరంగా ఉంది కదూ! ❑







కథ

# తీరని కోరిక

కాయల నాగేంద్ర

"రేపు విజయవాడ వరకు వెళ్లి వస్తాను" కాఫీ కప్పుతో వచ్చిన భార్యతో అన్నాడు రామారావు.

"రిటైరయిన తర్వాత ప్రయాణాల సరదా ఎక్కువైనట్లుందే! అంత కొంపలు మునిగే రాచకార్యం ఏముందక్కడ?" వ్యంగ్యంగా అంది ఆవిడ.

"అబ్బే... మరేంలేదు. అక్కడ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరుగుతున్నాయి. నాకు సాహిత్యమంటే ప్రాణమని నీకు తెలుసుగా, అందుకని..

ఈ సమాధానం ఆవిడకు తృప్తి కలిగించినట్లుంది.. "తిరుగు ప్రయాణం ఎప్పుడొస్తున్నారు?" అడిగింది.

"రెండు రోజుల్లో వస్తా" అన్నాడాయన.

సాధారణంగా రామారావు ఏ పని మీదైనా సరే ఇంకో ఊరు వెళ్లాల్సి వచ్చినప్పుడు ముందుగా భార్యకు తెలియజేయడం ఆయనకు అలవాటు. సర్వీసులో ఉండగానే ఏదో పని కల్పించుకొని విజయవాడ వెళ్దామని అనుకొన్నాడు. కానీ అది కుదరలేదు. ఆయనకు విజయవాడలో చేయగల రాచకార్యాలు ఏమీ లేవని ఆయనకు బాగా తెలుసు. కనీసం ఆ ప్రాంతంలో ఆయనకు స్నేహితులుగానీ, బంధువులుగానీ లేరు. ఒకవేళ వున్నా ఆయన భార్య లేకుండా ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లలేదు.

ఇప్పుడు ఆయనకు మంచి అవకాశం లభించింది 'సాహితీ సమావేశాలకు' అని ఆయన చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆడిన అబద్ధం. తనతో కూడా భార్య ప్రయాణమవుతుందేమోనని రామారావు ఎంతో భయపడ్డాడు. ఎందుకంటే ఆయన ఉద్యోగం చేసే రోజుల్లో ఎక్కడకెళ్లినా ఆవిడ కూడా రావాల్సిందే. ఇప్పుడు సాహితీ సమావేశాలన్నాడు కాబట్టి ఆవిడ రాకపోవచ్చు అనే ఆశ ఆయనకు మిగిలింది.

అతని భార్య నిజంగా రావటం లేదని తెలిసిన తర్వాత అతని ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆయనకు ప్రకృతి అంతా ఆహ్లాదకరంగా కనిపించింది. ఆయనకు ఇప్పుడే స్వతంత్రం వచ్చినట్లుగా ఫీలయ్యాడు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బాగా రద్దీగా ఉంది. ఇంతలో తను వెళ్లాల్సిన రైలు రావడంతో రైలెక్కి కూర్చున్నాడు. ప్లాట్‌ఫామ్ మీది అందచందాలను తిలకిస్తుండగా బిస్కెట్స్ అమ్మే పిల్లాడు ఒకడు కనబడ్డాడు. రైల్లో తినడానికని రెండు బిస్కెట్ ప్యాకెట్లు కొన్నాడు. తిందామని ప్యాకెట్ విప్పబోయాడు.

కంపార్టుమెంటులో అతనికెదురుగా కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు కుతూహలంగా రామారావుకేసి చూస్తున్నారు. బిస్కెట్ ప్యాకెట్ విప్పుదామనుకున్న



రామారావు ఒక్క క్షణం ఆగాడు. వాళ్లిద్దరూ ఎందుకట్లా చూస్తున్నారు.

పిల్లలు తినే బిస్కెట్లు తింటున్నాడని వాళ్లు అనుకుంటూన్నారేమో! రిటైర్‌పోయిన వ్యక్తి చిన్న పిల్లాడిలా బిస్కెట్లు తినడం ఏం బాగుంటుంది? వాళ్లకేసి సూటిగా చూడటానికి ధైర్యం చాలలేదు. బిస్కెట్ ప్యాకెట్టు విప్పబోయినవాడల్లా ఆగిపోయి, ప్యాకెట్లను పక్కనున్న హాండ్‌బ్యాగ్‌లో పెట్టేశాడు. తరువాత తిరిగి కిటికీలోంచి బైటకు చూస్తూ కూర్చున్నాడు. అప్పటికే రైలు వేగం పుంజుకుంది.

"బిస్కెట్లు తినడానికి వీలు లేకుండా పోయిందే" అని మనసు పీకుతూనే ఉంది.

నిజానికి తాను చేద్దామనుకున్న ఏ పనీ సవ్యంగా జరగడం లేదు. ఆయన ఒకటి తలిస్తే మరొకటి జరిగేది. డిగ్రీ పాసవగానే టీచర్ అవుదామనుకున్నాడు.

ఆ రోజుల్లో టీచర్లకు మంచి గౌరవం, హోదా ఉండేవి. కానీ వాళ్ల నాన్న అంతకుముందే ఒక పథకం వేసి క్లర్కుగా ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

ఆ పథకంలో భాగంగా ఆయన చూసిన సంబంధం చేసుకున్నాడు. అతని ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అతని పెళ్లి జరిగిపోయింది.

రైలు ఖాజీపేటలో ఆగింది. "తనకెదురుగా కూర్చున్నవాళ్లు ఇక్కడ దిగిపోతే బాగుండును. బిస్కెట్లు తినవచ్చు" అనుకున్నాడు రామారావు. వాళ్లు దిగలేదు సరికదా ఇంకో మనిషి వచ్చి వాళ్లతో జతయ్యాడు. ఆ వచ్చినాయన రామారావుని పలకరించాడు "ఎంతవరకు అంటూ".

"విజయవాడ వరకు, మీరూ?" అన్నాడు రామారావు మర్యాదపూర్వకంగా.

"రాజమండ్రి వరకు" నవ్వుతూ అన్నాడాయన.

"తనకెదురుగా కూర్చున్నవాళ్లు తనకు తెలిసినవాళ్ల కాదు. వాళ్లేమనుకుంటే తనకేం! బిస్కెట్లు తినేద్దాం" అనుకున్నాడు రామారావు.

కానీ మూడో మనిషి కొంచెం ముఖపరిచయం గలవాడవటంచేత ఆ పని చేయటానికి సాహసించలేకపోయాడు.

ఈ రకమైన ఆటంకాలు, ఆశాభంగాలు ఆయనకు కొత్త కాదు. వివాహమైన కొత్తలో విజయవాడకు ట్రాన్స్ ఫర్ చేశారని తెలియగానే "నేను అత్తా మామలను వదలి విజయవాడకు రాను" అంది ఆయన భార్య.

విజయవాడలో కళావతి ఇంట్లో సింగల్ రూమ్ అద్దెకు తీసుకున్నాడు. ఆఫీసు, రూము ఏమీ తోచనప్పుడు సినిమాలు, పార్కులో కూర్చోవటం అలవాటయింది.

రాత్రి ఎనిమిది గంటల లోపు రూముకు చేరుకుంటాడు. కిరోసిన్ స్టవ్ మీద గ్లాస్ బియ్యం కడిగి పెట్టుకుంటాడు. వద్దంటున్నా కళావతి కూరలు తెచ్చి ఇచ్చేది.

రైలు ఏదో చిన్న స్టేషన్‌లో ఆగింది. ప్లాట్‌ఫామ్ మీద అక్కడక్కడా ప్రయాణికులున్నారు. రామారావు దృష్టి ఒక అమ్మాయి మీద పడింది. ఆ అమ్మాయి తన పక్క కంపార్టుమెంటులో ఎక్కడానికి ప్రయత్నిస్తోంది. ఆమెను చూడగానే కళావతి గుర్తొచ్చింది. గులాబీరేకుల సౌకుమార్యం, జాజిమొక్కల లావణ్యం కలబోస్తే కళావతి. అంతా అందంగా ఉండేది. కళావతి వయసు పాతిక సంవత్సరాలు ఉండొచ్చు.

ఆ రోజుల్లో కళావతి కూడా ఇలాగే ఉండేది. ఇప్పుడెట్లా ఉందో? ఆవిడ భర్త ఒట్టి తాగుబోతు. ఇంటిపట్టున ఉండేవాడు కాదు. ఎప్పుడో రాత్రికి బాగా తాగి వచ్చేవాడు. అంచేత ఆవిడే చిన్న కిరాయికొట్టు పెట్టుకొని వచ్చే డబ్బులతో, అద్దెడబ్బులతో సంసారం చేసుకోవలసి వచ్చింది.

రామారావు గదిలో చేరినప్పటి నుంచి అతనంటే ప్రత్యేక అభిమానం చూపించేది కళావతి. ఆదివారం సెలవురోజుల్లో అతని కోసం ప్రత్యేకంగా వండి వడ్డించేది. పిల్లలు లేకపోవడంతో రామారావునే ఒక పిల్లాడిలా చూసుకునేది.

**ఒక అబ్బాయి తలుపు తీసి "ఎవరు కావాలి?" అని అడిగాడు. "కళావతి గారి కోసం వచ్చానని చెప్పడంతో" లోపలికొచ్చి కూర్చోమన్నాడు. లోపలికెళ్లి సోఫాలో కూర్చున్నాడు రామారావు.**

ఈ అభిమానాన్ని పురస్కరించుకొని రామారావు తొందరపడ్డాడో, లేకపోతే ఆవిడే అతన్ని ప్రోత్సహించిందో అతనికిప్పుడు జ్ఞాపకం లేదుగానీ ఆవిడ తనకక్కడ భార్య లేని లోటు తీర్చింది. రెండు నెలల తరువాత తను నెల తప్పిందని పాయసం చేసుకొచ్చి ఇచ్చింది.

ఈ విషయం గుర్తుకు రాగానే కళావతి ఇప్పుడెట్లా ఉందో! తనను గుర్తు పడ్తుందో లేదో! అదే ఆలోచన.... ఎలా మర్చిపోగలదు?

మరో రెండు నెలలకు అతన్ని తిరిగి హైదరాబాద్‌కు ట్రాన్స్ ఫర్ చేశారు. తరువాత ఆయనెప్పుడూ విజయవాడ వెళ్లలేదు.

తనతో పాటు కళావతి ఇంట్లో మరో గదిలో అద్దెకుంటున్న తోటి ఉద్యోగి ఉత్తరం రాస్తూ కళావతికి అబ్బాయి పుట్టినట్లు తెలియజేసాడు. రామారావు చాలా సంతోషించాడు. అయితే ఆ ఉత్సాహాన్ని ఆయన మనసులోనే అట్టే పెట్టుకోవాల్సి వచ్చింది.

తనకిప్పుడు మగపిల్లలు లేరు. ఉన్న ఒక్కగానొక్క కూతురు పెళ్లి చేసి అత్తవారింటికి పంపించేశాడు.

విజయవాడ చేరేవరకు ఆయన మనసులో రకరకాల ఆలోచనలు మెదలసాగాయి. కళావతి ప్రస్తుతం ఏ విధంగా ఉంటుందో ఊహించాడు. ఆమెతో సంభాషణ ఎలా మొదలుపెట్టాలో, మిగిలిన విషయాలు ఎలా మాట్లాడాలో రకరకాలుగా ఊహించుకోసాగాడు.

యాభై వేల రూపాయలు ఆయన ఏడాదిగా ఆమె కోసం పోగు చేశాడు. ఈ విషయం తన భార్యకు కూడా తెలియకుండా జాగ్రత్త పడ్డాడాయన. తన అభిమానాన్ని వ్యక్తం చేసేందుకు ఇంతకంటే మరో మార్గం కనపడలేదు. అందుకే ఈ విజయవాడ ప్రయాణం.

ఆయనకు తెలిసిన విజయవాడకు, ఇప్పుడు చూస్తున్న విజయవాడకు, చాలా తేడా ఉంది.

కళావతి కూడా ఇలాగే మారిపోయిందేమో! అనుకున్నాడు. లాడ్జిలో స్నానం చేసి తనకు తెలిసిన దారి గుర్తు పెట్టుకొని కళావతి ఇంటికి నడిచి వెళ్లాడు.

ఇదివరకు కళావతి రేకుల పోర్షన్ స్థానంలో పెద్ద భవనం ఉంది. ఒకవేళ కళావతి ఇక్కడి నుంచి వెళ్లిపోయిందేమోనన్న భయం ఆయనలో మొదటిసారిగా కలిగింది.

దగ్గర్లో ఉన్న కిళ్లీకొట్టు అబ్బాయిని అడిగాడు కళావతి గురించి.

"ఆ ఇల్లేనండీ! రేకుల ఇల్లు కూలగొట్టి ఈ బిల్డింగ్ కట్టారు. భర్త ఏడాది క్రితమే చనిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడు" చెప్పాడు కిళ్లీకొట్టు అతను.


రామారావులో ఏదో తెలియని భయం బయలుదేరింది. ఒక్క క్షణం ఆలోచించాడు. అయినా ధైర్యం కూడగట్టుకొని ఆ ఇంటికెళ్లి కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒక అబ్బాయి తలుపు తీసి "ఎవరు కావాలి?" అడిగాడు.

"కళావతి గారి కోసం వచ్చానని చెప్పడంతో" లోపలికొచ్చి కూర్చోమన్నాడు.

లోపలికెళ్లి సోఫాలో కూర్చున్నాడు రామారావు.

హాలంతా ఖరీదైన వస్తువులతో ఆధునికంగా అలంకరించబడి ఉంది.



# అమ్మలేఖ

**ఓ తల్లి మరణించిన పది రోజులకు తన కుమారుడికి రాసిన ఉత్తరం..**

**ప్రియమైన కుమారా,**

**నీలాంటి కొడుకు ఉన్న నేను పేదదానిలా ఎందుకు చనిపోయానో తెలుసుకోవాలనిపించింది.**

**నేను చనిపోయే ముందు నిన్ను ఆశీర్వదించాలని అనుకున్నాను. నువ్వసలు నా పక్కనుండటానికి సమయం కేటాయిస్తేగా!**

కానీ ఇప్పుడు పక్కనే ఉండి నన్ను నువ్వు అవీ ఇవీ చేసి సాగనంపావు నా ఆశీస్సులకోసం.

నేను బతికున్న రోజుల్లో అల్పాహారం, భోజనం వంటివి నాకొక సవాల్. అవెప్పుడు దయతలిచేవో తెలిసేది కాదు.

కానీ నా అంత్యక్రియల రోజున ఎన్ని రకాల వంటకాలో.. పానీయాలో.. ఎంతలా ఖర్చు చేస్తున్నావో.. ఎందరికి పెట్టావో!

ఒరేయ్ పుత్రా, నీకు తెలుసుగా నాకిష్టమైంది నూనె వేరుశెనగ అని. కానీ నువ్విప్పుడు నా మృతదేహం మీద ఖరీదైన సువాసన కలిగిన తైలాన్ని చల్లుతున్నావు.

బతికున్న రోజుల్లో ఓ మంచి బట్ట కొనడానికి ఆలోచించిన నువ్విప్పుడు నా శవాన్ని ఖరీదైన గుడ్డతో అలంకరించావు.

నేను శవమై మార్చురీలో ఉన్నప్పుడు నన్ను మాటిమాటికీ వచ్చి చూస్తుండేవాడివి. కానీ నేను బతికున్న రోజుల్లో అలా ఎన్ని రోజులు చూసావో నాకైతే గుర్తుకు రావడం లేదు. ఒకటి రెండు సార్లు మించి చూసినట్టు లేదు. ఎప్పుడొస్తావురా? అని అడిగితే "డబ్బులు కావాలా? చెప్పు.. పంపుతానని చెప్పేవాడివి ముక్తసరిగా. కొన్ని సార్లయితే కటువుగా.

చాలా బాధాకరమైన విషయం ఏమిటంటే బతికున్న రోజుల్లో కనీస అవసరాలకు సైతం ఎదురు చూసేలా చేసావు. ఇల్లు కూడా అరకొరగా ఉండేది. కానీ ఇప్పుడేమో ఖరీదైన శవపేటికలో ఉంచావు నన్ను. నేను మరణించిన మూడో రోజుకల్లా ఇంటికి రంగులు వేయించావు.

నీ చిన్నతనంలో నువ్వు తినడం కోసం నా ఆకలిని త్యాగం చేసిన సందర్భాలు అనేకం. నువ్వు తింటే చాలనుకుని తృప్తి పడ్డాను. నీకు సరిపడా బట్టలు సమకూర్చడం కోసం నేను ఒకటీ అరా గుడ్డలతో సరిపెట్టుకునేదానిని.. నేను పెద్దయ్యాక నన్ను నువ్వు చూసుకుంటావని కాదు, నిన్ను చూసుకోవడంలో ఓ ఆనందం, తృప్తి.



ఇప్పుడేమో నువ్వు నీకేవో మాటలు వచ్చని నాకు నివాళులర్పిస్తున్నావు. "అమ్మా, ఐ లవ్ యూ సో మచ్ రెస్ట్ ఇన్ పీస్" అని ఏవేవో రాస్తున్నావు. నీ సన్నిహితులతో ఆహా ఓహో అని చెప్తున్నావు నా గురించి. నాకు ఏడుపు రావడం లేదు, నవ్వు వస్తోంది.

ఇంతకూ ఇప్పుడీ ఉత్తరం ఎందుకు రాశానో తెలుసా? అమ్మంటే ఏమిటో చెప్పాలనిపించి ఈ నాలుగు మాటలూ రాశానంతే.

దేవుడు నిన్ను క్షమించాలని నేను ఆ భగవంతుడ్ని వేడుకుంటున్నాను.

నువ్వు క్షేమంగా ఉండటమే నాక్కావాలి.

ఇట్లు

నీ ప్రియమైన అమ్మ

**- యామిజాల జగదీశ్**

ఆ వాతావరణం పరిశీలించిన తరువాత ఆయనలో భయం ఎక్కువయింది.

కళావతి మనవడు కాబోలు ఆయనకేసి తదేక దీక్షగా చూస్తున్నాడు.

రామారావు నవ్వడానికి ప్రయత్నించాడు. ఆ బాబుని దగ్గరకు రమ్మని పిలిచాడు.

బాబు ఏమీ మాట్లాడకుండా అట్టాగే చూస్తూ నిల్చుండిపోయాడు.

"ఎవరు కావాలండీ?" అన్న పిలుపుతో ఆయన ఈ లోకంలోకి వచ్చాడు.

రామారావుకి సమాధానం ఏమి చెప్పాలో తోచలేదు. పైగా ఆయన ఊహించని ప్రశ్న ఇది.

తనను చూడగానే కళావతి గుర్తుపట్టి ఆశ్చర్యంలో మునిగి తేలుతుందనుకున్న అతనికి ఇటువంటి ప్రశ్నకు సమాధానం చెప్పవలసి వస్తుందని అనుకోలేదు.

ఎదురుగా సాక్షాత్తు కళావతి నిల్చుని ఉంది. తను ఊహించిన కళావతికి, ఈవిడకు చాలా తేడా ఉంది. నెరిసిన జుట్టు, ఇస్త్రీ చేసిన కాటన్ చీర, ఒంటినిండా నగలున్న ఆవిడను చూసిన రామారావుకి నోట మాట రాలేదు.

"ఎవరికోసం వచ్చారండీ?" మళ్లీ ఆవిడే ప్రశ్నించింది.

"అబ్బే! ఏం లేదు. మాది హైదరాబాదు. నేను ఇదివరకు ఇక్కడ పనిచేసే రోజుల్లో మీ ఇంట్లోనే అద్దెకుండేవాడిని, నా పేరు రామారావు. పని మీద ఇక్కడికొచ్చాను. ఒక్కసారి చూసిపోదామని" అన్నాడాయన.

"అలాగా! సంతోషమండీ. మీ లాంటివాళ్లు చాలా మంది మా ఇంట్లో అద్దెకుండి వెళ్లిపోయారు, గుర్తుపట్టలేకపోయాను" అంది.

తరువాత ఏం మాట్లాడాలో రామారావుకి తోచలేదు. ఆవిడ తనను గుర్తించిందో లేదో తెలియదు. గుర్తించి కూడా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోకుండా ఉండాలని ప్రయత్నిస్తోందా? అనేది అర్థం కాలేదు.

తన ఓటమిని అంగీకరించక తప్పలేదు రామారావుకి.

# 'బాపు' కళాప్రతిభ

**అలనాటి ఇతిహాస యుగం, నేటి అధునాతన కాలం రెండింటా తెలుగు సాహిత్యానికి, రేఖలలో చిత్రలేఖన శైలి సృష్టించిన బాపు, బొమ్మలతో మాట్లాడించడం, మాట్లాడే బొమ్మలతో నటింపచేయడంలో సిద్ధహస్తునిగా భారతీయ కళా సరస్వతికి, తెలుగు సీమకు ఋణపడింది.**



బాపు తన జీవిత కాలంలో గీసిన ప్రతీ గీతా, వెన్నెలతో పరవశించే కన్యకలా సమ్మోహింపచేస్తుంది. మాటలతో వ్యక్తీకరించలేని భావాలను పలకరింపచేయడంలో బాపుకు సమానమైన కళాకారుడు ఆసేతు హిమాచలంలో లేరనేది అక్షర సత్యం.

1933 డిసెంబరు 15న జన్మించిన సత్తిరాజు లక్ష్మీనారాయణ, కుంచె పట్టి ఆ'రంగే'ట్రం చేసింది బాలసాహిత్యంతో. మద్రాసులో అయిదో ఫారం చదువుతుండగా బాల మాసపత్రికకు 1946 జులై సంచికలో, కవ్వం చిలుకుతున్న అమ్మాయి బొమ్మ అచ్చులో వచ్చిన మొదటి బొమ్మ. ముళ్ళపూడి వెంకటరమణ, సత్తిరాజు లక్ష్మీనారాయణల సాహితీ, చిత్ర కళా స్నేహానుబంధం పిల్లల రాతపత్రిక ఉదయభానుతో ప్రారంభమై 'బాపు-రమణ' ఒకే అపురూప జీవన సర్వస్వంగా తెలుగు సాహితీ కళారంగాన్ని ప్రభావితం చేసింది. వారి సాహితీ సర్వస్వంలో 'బుడుగు' ఆంధ్రపత్రిక 1956-1957 సీరియల్ ఆఖరి వారంలో 'నా పేరు బుడుగు. ఇది రాసినపెట్టినవాడి పేరు ముళ్ళపూడి వెంకటరమణ, బొమ్మలు వేసినవాడి పేరు బాపు..' అని బుడుగు చిచ్చుల పిడుగు అనేంతవరకు ఆ సీరియల్ కర్తృత్వం వెలుగులోకి రాలేదు. బాల సాహిత్యంలో 'బుడుగు' వినూత్న ఒరవడికి తెర తీసింది.

'బాలరాజు కథ' పూర్తిగా పిల్లల సినిమా. 'ముత్యాల ముగ్గు' సినిమాలో కూడా రాము, శాంత పాత్రలకు ఇచ్చిన ప్రాముఖ్యత, సంఘటనల సమాహారం, కథా కథనం బాపుకు పిల్లలపై ప్రేమానురాగాలను చాటుతుంది. బాపు-రమణల మీగడ తరగలు వీడియో పాఠాల రూపకల్పన దృశ్య శ్రవణ మాధ్యమంలో ప్రపంచంలో అరుదని బిబిసి(లండన్) నాడు అభినందించింది.

పిల్లలు, పెద్దలను అనుకరించే ప్రయత్నంలో, ప్రతీ విషయం నేర్చుకొంటారని, పెద్దలు పిల్లల ముందు చాలా జాగ్రత్తగా బాధ్యతతో ఆచి తూచి వ్యవహరించాలనే సందేశాన్ని వ్యంగ్యం, అపురూప హాస్యంతో అందించడం బాపు-రమణలకే చెల్లింది. బాపు బొమ్మల కథల్లో 'రాచ్చసుడూ-పదమూడో ఎక్కం' వంటి బుడుగు కథలు, బొమ్మరిల్లులో ఉత్పల, నండూరివారి గేయకథలు బాల సాహిత్యంలో ఆణిముత్యాలు... ఎన్నో.. ఎన్నెన్నో..!

**"కొంటెబొమ్మల బాపు**
**కొన్ని తరముల సేపు**
**గుండె ఉయ్యాల నూపు ఓ**
**కూనలమ్మా"**

అన్నారు ఆరుద్ర. ఆయన గీసిన బొమ్మలు దాదాపు రెండు లక్షలు వుండవచ్చని అభిమానుల అంచనా. నిగర్వి, నిరాడంబరుడు, స్థితప్రజ్ఞుడు, అవిశ్రాంత కళా శ్రామికుడు ప్రపంచ చిత్రకళా చరిత్రలో ప్రతిభావంతుడైన బాపు వ్యక్తిత్వం అనన్య సామాన్యం.

బాపు పేరు తలచుకోగానే కందుకూరి రుద్రకవి మత్తకోకిల వృత్తాన్ని, జనార్దనుడి శృంగారమూర్తిని ముప్పేటగా అలంకరించి చిత్రించిన జనార్దనాష్టకం, అష్ట విధ నాయికల హావ, భావ, స్వర్ణ వర్ణ విభూషితాలు, దాశరథి, గాలిబ్ గీతాలు, పుట్టపర్తివారి శివతాండవం గేయ కథనానికి అనుసరించిన చిత్రణశైలి, ప్రాచీన ప్రబంధకవులే కాక విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, నండూరి, దాశరథి, సినారె, శేషేంద్ర, విద్వాన్ విశ్వం వంటి ఆధునిక కవుల గీతాలకు తెలుగు కవిత్వ చరిత్ర వారు అనుసరించిన శైలి, కవి హృదయాలను చిత్రకార శిల్పిగా ఆవిష్కరించిన చిత్రరచన అద్భుతాలు గుర్తుకు వస్తాయని, ప్రముఖ కవి, సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత శర్మ అంటారు. ఆర్టిస్ట్, కార్టూనిస్ట్ బాపు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాని చిత్రకారునిగా అన్నమాచార్య సంకీర్తనల మహత్యం, బ్రహ్మోత్సవాల వీడియోలు రూపొందించారు.



తిరుప్పావై పాశురాలకు చిత్ర వ్యాఖ్యానం సమకూర్చారు.

తెలుగు దర్శకుడు వంశీ, 1996లో బాపుపై డాక్యుమెంటరీ తీసారు. 1967లో 'సాక్షి' చిత్రంతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన బాపు-రమణల సినీ ప్రస్థానం 'శ్రీరామరాజ్యం'(2011) వరకు అద్భుతంగా కొనసాగింది. బాపు తన సినీ జీవితంలో 40 తెలుగు, 9 హిందీ, 1 తమిళ చిత్రాలకు దర్శకత్వం వహించారు.

1962లో మొట్టమొదటి బాపు చిత్రకళా ప్రదర్శనం, 'నక్షత్ర సప్తకల' నిర్వహించింది. సీతాకల్యాణం, సినిమా లండన్, చికాగో, బెర్లిన్, సాన్‌రెనో, డెన్వర్.. ఇలా ఎన్నో అంతర్జాతీయ చిత్రోత్సవాలలో ప్రదర్శించబడి బ్రిటిష్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో పాఠ్యాంశంగా అంతర్జాతీయ కీర్తి పొందింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపు గీత, రాత తెలుగు సంస్కృతిలో అంతర్భాగమయ్యాయి. 2014 ఆగస్టు 31న స్వర్గస్తులైన బాపు తెలుగు సాహితీ, చిత్రకళా, చిత్ర రేఖా మహోన్నత విలువలను జాతీయ, అంతర్జాతీయ రంగంపై విశ్వవ్యాప్తంగా ఉన్నత శిఖరంపై అధిష్ఠింపచేసిన మహామేధావిగా చిరస్మరణీయులు.

**- జయసూర్య**




### ఆ ఒక్కటీ అడక్కు

"ప్రియా! నీ కోసం ఏమైనా చేస్తాను' అన్నాడు రాజు.

"ముందు మన పెళ్లి గురించి మీ ఇంట్లో చెప్పు" అంది ప్రియ.


"ఆ ఒక్కటీ అడక్కు, మరేదైనా చెప్పు" బదులిచ్చాడు రాజు.

### బోనస్ వచ్చిందిగా!

"ఏంటి విశేషం? ఈరోజు టీ చాలా రుచిగా ఉంది?" అన్నాడు భర్త.

"ఈరోజు మీకు బోనస్‌డబ్బులు అందాయిగా" గడుసుగా బదులిచ్చింది భార్యామణి.

### ఏ లోటు లేదు



"ఏం వదినా! తీరుబడిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నావు?" అడిగింది పద్మ.

"అందరూ నన్ను దొంగభార్య అంటారనే బాధ తప్ప ఇంకే విషయంలోనూ నాకు లోటు లేదొదినా!" విచారంగా సమాధానమిచ్చింది కాంతం.

### ఇంటికి వెళ్లాలనే..

"స్కూలుకి యూనిఫామ్ వేసుకుని రాకపోతే ఇంటికి పంపిస్తానని తెలుసు కదా! మరి.. యూనిఫామ్ ఎందుకు వేసుకుని రాలేదు?" అని చింటూని అడిగింది టీచర్.

"ఇంటికెళ్లిపొమ్మంటారనే యూనిఫామ్ వేసుకుని రాలేదు టీచర్" బదులిచ్చాడు చింటూ.

- వైదా ఈశ్వరరావు, విశాఖపట్నం

### మనింటి గురించి..

తన భర్త గూగుల్ రివ్యూలో తన అన్న నడిపే హోటల్ గురించి చెత్తగా రాశాడని సుమతికి పట్టరాని కోపం వచ్చి భర్తను నిలదీస్తే అతడు చాలా ప్రశాంతంగా "నేను అలా రాయలేదు. మన ఇంట్లో తిన్న టిఫిన్ ఎలా ఉందో... దాని గురించి రాసాను. మీ అన్నయ్య తప్పుగా అర్థం చేసుకుంటే నేనేం చేయాలి?

- కె.లవారి, కరీంనగర్

చిన్న కథ

# చెవులు కుట్టబడును

'చెవులు కుట్టబడును' అన్న పెద్ద బోర్డు చూసాను.

సినిమా పేరు కింద టాగ్ లైన్ ఉన్నట్లు 'చెవులు కుట్టబడును' కింద 'చిన్న పిల్లలకు నొప్పి తెలియకుండా లేటెస్ట్ టెక్నాలజీతో చెవులు కుట్టబడును' అని రాసి వుంది.

"చెవులు కుట్టడానికి నొప్పి లేకుండా, అనస్థీషియా క్రీమ్ వాడుతారనుకొంటాను" అన్నాను.

"అలాంటి క్రీములు వాడుతారా? లేదా అని మా ఆవిడ కనుక్కొని రమ్మంది" అన్నాడు పరాంకుశం.

"న్యూ టెక్నాలజీ అంటే అదే ఉంటుంది పరాంకుశం"

"అలాగైతే వద్దని మా ఆవిడ చెప్పింది".

అక్కడ కూర్చొన్న అతని దగ్గరకు వెళ్లాం "రండి సార్, ఎవరికి చెవులు కుట్టాలి?"

"మా పాపకే ఈ వారం కుట్టించాలని అనుకుంటున్నాం. న్యూ టెక్నాలజీ అంటున్నారు, అనస్థీషియా ఉపయోగిస్తారా?"

"లేదు సార్, అలాంటిదేమీ ఉపయోగించం. కొత్త టెక్నాలజీతో పాపకు చెవులు కుడతాం. పాపకు చెవులు కుట్టిందే తెలీదు. నొప్పి, ఏడుపు లాంటివి ఉండవు. నొప్పి అంటూ పాప ఏడ్చిందంటే మేం డబ్బులు తీసుకోం సార్" అన్నాడు.

"మరి నొప్పి లేకుండా.... ఎలా?"

"అప్పుడు చూడండి సార్.. మీ ముందే చెవులకు రంధ్రం వేస్తాం. మీరు ఎప్పుడొస్తారు?"

ఈ వారం మా బంధువులు వస్తున్నారు. చెవులు కుట్టించి అలాగే గుడికి వెళతాం" అన్నాడు.

"చెవులు కుట్టడానికి ఎంత తీసుకొంటారు?" అడిగాడు.

అతను చెప్పిన ధర విని ఉలిక్కిపడ్డాను. చాలా ఎక్కువగా చెప్పాడు.

పాపను ఏడిపించకుండా చెవులు ఎలా కుడతారో అన్న ప్రశ్న నా ముందు పెద్ద భూతంలా నిలిచింది. ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. చెవులు కుట్టడానికి పరాంకుశం నన్ను పిలుస్తాడో? లేదోనని అనుమానం. ఎందుకంటే ఇది బంధువుల పండుగ మాత్రమే. నన్ను పిలిచి మా మిత్రులను పిలవలేదంటే



వారందరూ కలిసి వీడి చెవులు ముక్కు కుట్టకపోయినా పిండేస్తారు.

అనుకున్న విధంగానే వాడు చెవులు కుట్టే ఫంక్షన్‌కు పిలవలేదు.

ఆ సాయంత్రం వాడింటికి వెళ్లాను.

బంధువులు చాలా మంది వచ్చి పోయినట్లున్నారు.

"చెవులు కుట్టేటప్పుడు పాప ఏడ్చిందా?"

"కుయ్..కియ్..ఉస్.. మని కూడా అనలేదు. పాపకు చెవులు కుట్టిన సంగతే తెలీదు.

"ఏమిటా టెక్నాలజీ"

"ఆ టెక్నాలజీ చూసాక మాకూ చెవులు కుట్టినట్లనిపించింది" అన్నాడు"

"ఏమిత్రా నీవు చెప్పేది?" అడిగాను.

"మా బంధువులతో కలిసి ఉదయం అక్కడకు వెళ్లాం. లోపలకు పాపతో పాటు తల్లిదండ్రులు మాత్రమే రావాలన్న నిబంధన పెట్టాడు.

ఆ లోపల పెద్ద స్క్రీన్ ఉంది. దానికి వీడియో గేమ్స్ లింక్ వుంది. మా పాప చేత వీడియో గేమ్స్ ఆడించాడు. పాపా పూర్తిగా అందులో లీనమైంది. అప్పుడు చెవులు కుట్టాడు. ఈ వీడియో గేమ్స్ ముందు అనస్థీషియా మందు తల వంచుకోవాల్సిందే" అన్నాడు పరాంకుశం.

- ఓట్ర ప్రకాష్ రావు

# ఆదివాసీల ఆత్మగౌరవ సూచిక 'పచ్చబొట్టు'

**నుదుటి మీద బొట్టు పెట్టుకోవడం భారతీయతే కాదు.. చక్కని ఆరోగ్య హేతువు కూడా. బొట్టు కొద్దికాలం వుండిపోతుంది. కానీ కలకాలం చెరిగిపోకుండా కడదాకా వుండేది కేవలం 'పచ్చబొట్టు' మాత్రమే. ఈ తరంవారికి పచ్చబొట్టు అంటే ఒంటిపై వేయించుకొనే ఫ్యాషన్ చిహ్నామని, టాటూ పేరుతో చిత్రించుకొనే మాడ్రన్ డిజైన్ అని భావిస్తారు. కానీ నిన్నటి తరంవారికి అది జీవితాంతం గుర్తుండిపోయే ఓ పదిల జ్ఞాపకం. ఆదివాసీలకైతే అదో సంప్రదాయం.**

పచ్చబొట్టు అనేది ఆదివాసీ ఆడబిడ్డల పాలిట గౌరవ చిహ్నామే కాదు, ఒకప్పుడు వారి పాలిట ఆత్మరక్షణ కవచమై ఆదిమ జాతిని కాపాడింది కూడా. అందుకే ఆదివాసీలు నేటికీ పచ్చబొట్టు ధరిస్తూ ఆ సంప్రదాయాన్ని కాపాడుకుంటున్నారు. తమ వారసత్వ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నారు. ఈ పచ్చబొట్లు అనేవి ఆదివాసీ అమ్మాయిలకు అందంకోసమే కాక, తమ జాతి గుర్తింపు కోసం ఉపయోగపడే సాంస్కృతిక చిహ్నాలు. తమ జాతి రక్షణ కవచాలు కూడా అవే! ఆనాడు తమ జాతిని, శత్రురాజుల నుండి రక్షించిన పచ్చరంగునే 'పచ్చబొట్టు' పేర ముఖంతో పాటు శరీరంలోని వివిధ అవయవాల మీద రకరకాల ఆకృతులతో అలంకరించుకుంటున్నారు. గిరిజనుల్లో పచ్చబొట్టు అనేది తోటి, కోలాం అనే తెగలోని స్త్రీలకు మాత్రమే ఒకప్పుడు పరిమితమైన కళ. నేడిది విశ్వవ్యాప్తం అయింది.

అనేక గిరిజన తెగలు నాటి సంప్రదాయాన్ని కాపాడుకుంటూనే ఇప్పటికీ ఆరోగ్యపరంగా మంచిదని పచ్చబొట్లు పొడిపించుకోవడం విశేషం. పచ్చబొట్లు ఎంత ఎక్కువగా పొడిపించుకుంటే వారు అంతటి ధైర్యవంతులుగా సమాజంలో గౌరవించబడతారని వారి ప్రగాఢ నమ్మకం. ఈ పచ్చబొట్టు పొడిపించుకోవడానికి ధైర్యంతో పాటు ఓపిక కూడా అవసరం. సన్నని సూదులతో చర్మంపై గుచ్చుతూ పొడిచే సమయంలో తీవ్రమైన నొప్పి, బాధ కలుగుతాయి. ఎలాంటి మత్తుమందు అవసరం



లేకుండానే ఆ బాధను భరించి తమ సంస్కృతిలో భాగమైన పచ్చబొట్లు పెట్టుకోవడం నిజంగా సాహసం అనిపిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని ఆదివాసులు వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తారు.

విభిన్న తెగలకు చెందిన ఆదివాసీ గిరిజనులకు పచ్చబొట్టు ద్వారా ఎవరు ఏ తెగకు చెందినవారో గుర్తించవచ్చుట! భిల్లుల జాతిలో స్త్రీలు పెళ్లికి ముందు పక్షి ఆకారపు పచ్చబొట్టును కళ్ల దగ్గర, కణత ప్రాంతంలో పొడిపించుకుంటారు. ఇలా చేయడంతో వారిలో ఒక విధమైన భద్రతా భావం పెరగడమే గాక శుభ సూచకంగా కూడా భావిస్తారు. అక్కడి తెగవారు మాత్రమే కంటి వద్ద తేలుబొమ్మలు పొడిపించుకుంటారు. తాము చేసే మంచి పనులకు గుర్తుగా చనిపోయిన తరువాత కూడా ఇవి ఉంటాయని వారి నమ్మకం. స్త్రీలు పచ్చబొట్లపై ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. పచ్చబొట్లలో ఎక్కువగా జంతువులు, మనిషిబొమ్మలు వేయించుకోవడం చాలా ఇష్టం.

బస్తర్ ప్రాంత వనవాసీ స్త్రీలకు ఈ పచ్చబొట్లు అంటే మక్కువ ఎక్కువ. విదర్భ ప్రాంతంలోని మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిశాలో నివసిస్తున్న గిరిజనులు కూడా పచ్చబొట్లు పొడిపించుకుంటున్నారు. పచ్చబొట్లకు వాడే రంగులు సహజసిద్ధమైన వనమూలికలు కాబట్టి వాటిని పొడిపించుకోవడం వల్ల అందానికి అందంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందని నమ్మకం. మోకాళ్ల నొప్పులు, మోచేతుల నొప్పులు, తలనొప్పితో పాటు నరాల సంబంధమైన వ్యాధులకు కూడా పచ్చబొట్టు దివ్యమైన ఔషధంగా పని చేస్తుందని వారు భావిస్తారు. పక్షవాతం వంటి భయంకర వ్యాధుల బారిన పడకుండా పచ్చబొట్లు రక్షిస్తాయని వారు అనుభవ పూర్వకంగా చెబుతున్నారు.

'దేల్‌ఖండ్' తెగవారి నమ్మకం ప్రకారం స్త్రీ చనిపోయేటప్పుడు ఆమె వద్ద మిగిలే ఏకైక ఆస్తి 'పచ్చబొట్టు' మాత్రమేనని నమ్ముతారు. ఎక్కడైతే అభద్రతా భావం ఏర్పడుతుందోనని అనుమానం కలిగితే అక్కడి మహిళలందరూ పచ్చబొట్లు పెట్టుకోవాల్సిందేనట! రోగాలు సంభవించినప్పుడు ప్రభావిత భాగాలపై పచ్చబొట్లు వేసుకునే సంప్రదాయం గిరిజనులకు పూర్వ కాలం నుండి ఉంది. పూర్వం తమ పిల్లల్ని గుర్తు పట్టేందుకు శిశువుకు మూడు నెలలు రాగానే పచ్చబొట్లు వేసేవారు. కవల పిల్లలైతే కచ్చితంగా ఒకరికైనా వేయాల్సిందే.

ఇందుకు వారాంతంలో జరిగే సంతలు, గ్రామదేవతల ఉత్సవాలను ఈ పచ్చబొట్లు పొడిపించుకోవడానికి ఉపయోగించుకునేవారు. పచ్చబొట్లు వేసే గిరిజన మహిళలను బిరుదోళ్ల అని పిలుస్తారు.

## పచ్చబొట్లను తయారు చేసే విధానం

సన్నని మూడు సూదులను దగ్గరగా చేర్చి చేతికి పట్టుకొనేలా దారంతో చుట్టగా చుట్టి, పెద్దేగి(ఒక అడవిజాతి) చెట్టుబెరడును తెచ్చి చిన్న కుండంలో వేసి మాడిపోయేవరకు వేడి చేస్తే పచ్చని రంగు వస్తుంది. దానిని సన్నటి కట్టెపుల్లతో శరీరంపై మొదట ఆకారం వేసి, ఆముదం నూనెను, ఆ రంగులో ముంచి శరీరంపై సూదితో పొడుస్తారు. దీనితో పచ్చబొట్టు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇది క్రమశిక్షణ, ఓర్పుతో వేస్తుంటారు. మొదట చిత్రమాల ఆకుల రసంతో పచ్చబొట్లు మొదలుపెట్టారు. ఇది తయారు చేసుకునేందుకు వేర్వేరు పద్ధతులు వాడుతుంటారు. కొందరు పాము చర్మం కాల్చి బూడిద చేసి దానిని అవిశనూనెలో కలిపి పచ్చబొట్టు తయారు చేస్తారు. కొందరు పచ్చని ఆకులు, దొండ ఆకుల రసాన్ని తీసి దీపపు మసి చేత కర్రలు కాల్చగా వచ్చిన బొగ్గుల మసిని కలిపి దీనిని తయారు చేయడం మరో పద్ధతి.

సాధారణంగా మహిళలే ఈ పచ్చబొట్లు వేయడంలో తర్ఫీదు పొంది, వారే ఒకరికి ఒకరు పొడుచుకుంటారు. పచ్చబొట్లు వేయడానికి వారికి దసరా నుండి సంక్రాంతి పండుగల మధ్య అనుకూల సమయం.



పురాణం ప్రకారం ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణంలో తోటి గిరిజనులు పచ్చబొట్టు వేశారనీ, పార్వతికి నుదుటిపై పచ్చబొట్టు వేసాకే వివాహం జరిగిందని చెబుతుంటారు. ఇదే సంప్రదాయాన్ని అసిఫాబాద్ జిల్లాలోని రాజ్‌గోండు అమ్మాయిలు పెళ్లిపీటలు ఎక్కేముందు నుదుటిపై సూర్యచంద్రులు ఆకారంలో పచ్చబొట్టు వేయించుకునేవారు. మూడు నెలల శిశువుకు దిష్టిబొమ్మతో మొదలై వృద్ధుల వరకు మహిళల చేతులపై దైవ చిహ్నాలు, నవగ్రహాలు, పుష్పాలు, నచ్చినవారి పేరు వంటివి సందర్భాన్ని బట్టి వేసుకునేవారు. ఈ పచ్చబొట్ల సంప్రదాయం క్రీ.పూ.1400 సంవత్సరాల నుండి ఉన్నట్లు తెలుస్తోంది. 'పచ్చబొట్టూ చెరిగిపోదులే...' అని ఒక రచయిత పాటలో వర్ణిస్తే, నాడు ఆదివాసీలపై పరిశోధనకు గాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన విదేశీ పరిశోధకులు ప్రొఫెసర్ హైమండార్ఫ్, మైఖేల్ యార్క్ వంటివారు తమ రచనలు, డాక్యుమెంటరీల్లో పచ్చబొట్టును ప్రస్తావించారు.

హైదరాబాద్‌లోని ఐఐటి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు పచ్చబొట్టుపై 2020 సంవత్సరంలో అధ్యయనం చేసి పచ్చబొట్టుకు తొలి తరం వారసులైన తోటి తెగవారు ప్రస్తుతం పది వేల మంది మాత్రమేనని తేల్చారు.

ఈ పచ్చబొట్ల సంప్రదాయం విదేశాల్లో ముఖ్యంగా ఆసియా ప్రాంతంలోని గిరిజనుల్లో అధికంగా కనిపిస్తుంది. కేవలం గిరిజనులే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అన్ని తెగల్లో పచ్చబొట్లు పొడిపించుకోవడం ఇప్పుడు సర్వసాధారణం అయినప్పటికీ ఆధునిక కాలంలో నొప్పి లేని కృత్రిమ పచ్చబొట్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. మొత్తం మీద పచ్చబొట్ల సృష్టికర్తలు వనవాసీలు అన్నది చరిత్ర చెబుతున్న సత్యం.

గిరిజన ప్రాంతాలకు వలసలు పెరగడంతో ఇప్పుడు గిరిజనేతరులకు కూడా ఈ ఆచారం అలవాటు పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1980-1990 దశకం మధ్యలో తీవ్ర వాదం ప్రబలిన సందర్భంలో కొన్ని అవాంఛనీయ నిర్బంధాల వల్ల తమకు గుర్తింపు చిహ్నాలు కనిపించవద్దని ఆదివాసులు పచ్చబొట్లకు దూరం అయినట్లు తెలుస్తోంది. నేటి సమాజంలో జరిగే కొన్ని అవాంఛనీయమైన సంఘటనలు, కొన్ని చోట్ల మహిళలకు జరిగే అవమానాల వల్ల పచ్చబొట్లను తిరస్కరిస్తున్నట్లు భోగట్టా! ఇలాంటి కారణాల వల్ల ఎక్కువ మంది మహిళలు పచ్చబొట్టుపై ఆసక్తి చూపడం లేదు. భవిష్యత్తు తరాలకు ఈ కళ అందితేనే పచ్చబొట్టు పదిలంగా ఉంటుంది. తరతరాల సంప్రదాయాలు రక్షించబడితేనే పచ్చబొట్టు సంప్రదాయం కూడా పునర్దర్శనమవుతుంది.

**- గుమ్మడి లక్ష్మీనారాయణ**



యాత్రా కథనం

# అట్లాంటాలో దొర్లుతున్న జలాలు



**వీక్షిస్తే అతి సామాన్యమే అనిపించినా తరచి చూస్తే ఎన్నో అందాలు, ఆహ్లాదాన్ని కలగచేసే 'వ్యూ' నిజంగా ఒక అద్భుతమే అనిపిస్తుంది. అమెరికాలోని జార్జియా అట్లాంటాకు సమీపంలో వున్న 'అమికలోల వాటర్ ఫాల్స్‌ను సందర్శించినవారికెవరికయినా అలాంటి అనుభూతి కలుగుతుంది.**


ఆ జలపాతాల సవ్వడిలో సందడి చేయాలని, చిన్న పిల్లల్లా గెంతులేయాలని తహతహ కలుగుతుంది. అవునుమరి.. 'అమికలోల వాటర్‌ఫాల్స్' అంటేనే దొర్లుతున్న జలపాతాలు. ఈ జలపాతాల చెంత వుంటే మది సైతం తుళ్లుతుంది.

మేం అట్లాంటాలో వున్న సమయంలో ఒక వారాంతంలో ఈ 'అమికలోల వాటర్ ఫాల్స్'ను దానికి సమీపంలో వున్న అందమైన ప్రకృతిని వీక్షించే భాగ్యం కలిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో జలపాతాలు వున్నా అన్నీ ఒక్కతీరుగా కనిపించినా దేని ప్రత్యేకత దానిదే. అలాగే ఈ జలపాతం కూడా ప్రకృతి ప్రేమికులను పరవశింపచేస్తాయి.

అట్లాంటా నుంచి కేవలం రెండు గంటల ప్రయాణ దూరంలో ఉన్న ఈ 'అమికలోల వాటర్ ఫాల్స్' ఎన్నో అందమైన అనుభూతులను అందచేసింది. ఈ జలపాతాలను కలిగిన స్టేట్ పార్క్ జార్జియా రాష్ట్రంలోని దాసన్‌విల్లెలో ఎల్లిజమ్, దష్లానెగా మధ్య చట్లా హూచీ నేషనల్ ఫారెస్ట్‌లో వున్నది. దీనిని 1940లో రాష్ట్ర ఉద్యానవనంగా స్థాపించబడినప్పటి నుంచీ సందర్శకుల రాక అధికమయింది. అందుకే ఇది పర్యాటక ప్రదేశంగా ఖ్యాతి చెందింది.

'అమికలోల జలపాతం' 730 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతుంది. పూర్తి ఫారెస్ట్ వాతావరణంలో చూపరులకు ఎంతో సాంత్వన కలగచేస్తుంది జలపాతం. చట్లాహూచీ నేషనల్ ఫారెస్ట్ నడిబొడ్డున 829 ఎకరాల పర్వత అరణ్యంలో ఈ వాటర్‌ఫాల్స్ అందాలు దాగి వున్నాయి.

మిసిసిపి నదికి తూర్పున వున్న మూడవ జలపాతమిది. హైకింగ్, వాకింగ్ ట్రైల్స్ ఉద్యానవనం గుండా వెళతాయి. అమెరికా ప్రజలు జీవిత కాలంలో ఒకసారి చేసే సాహస యాత్రలో 'అప్పలాచియన్ ట్రైల్స్' ఒకటి. ఇది 8 మైళ్ల పర్యంతం సస్పెన్షన్ బ్రిడ్జి మీద వాకింగ్ చేయవలసి ఉంటుంది. 425 మెట్లను అధిరోహించాలి.



ఎత్తయిన జలపాతాల్లో ఒకటయిన 'అమికలోల వాటర్‌ఫాల్స్' చెంత సామూహిక సమావేశాలకు అనుకూలంగా ఉంటుంది. అలసట తెలియకుండా ట్రైల్స్ చేయవచ్చు. అన్నింటికీ మించి ఈ అమికలోల వాటర్ ఫాల్స్ అతి ప్రత్యేకత ఏమిటంటే 'పర్వతాల వెనక సూర్యుని అస్తమయం' జీవితకాల అనుభూతులను స్వంతం చేయడం.

వారాంతపు సెలవుదినాల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకు తగినట్లు విస్తారమయిన పార్కింగ్ ప్రదేశానికి సైతం లోటు లేదు. చూడవలసిన అందమైన 'కోన' ఇది.

**- పంతంగి శ్రీనివాసరావు**


## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్,
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆర్థికంగా బాగుంటుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. కోర్టు వ్యవహారాలు పరిష్కారమవుతాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. వాహన యోగం. వాక్చాతుర్యంతో పనులు పూర్తి చేస్తారు.

## వృషభం



క్రయ-విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. స్త్రీల వల్ల అధిక ఖర్చులు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు పనివత్తిడి అధికం. కుటుంబ సమస్యలు తీరుతాయి. ఉన్నతాధికారులను సందర్శిస్తారు. రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. కళాకారులకు సన్మాన యోగం. వ్యతిరేకతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## మిథునం



వృత్తి వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యం. ముఖ్యమైన ప్రయత్నాలు ఫలిస్తాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలు చేసేవారికి ఆశాజనకంగా ఉంటుంది. ఉద్యోగులకు సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు తీరుతాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం శ్రేయస్కరం.

## కర్కాటకం



ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారాంతంలో రుణాలు తీరుస్తారు. ప్రతికూలతలు ఎదురైనా పనులు పూర్తి చేసి అందరి ప్రశంసలు పొందుతారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రముఖులను సందర్శిస్తారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

## సింహం



కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. సామాన్య ధన లాభం. మనోధైర్యంలో క్లిష్టమైన పనులను పూర్తి చేస్తారు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలకు అవకాశం. వ్యాపారులు అధిక రుణాలు చేయాల్సి వస్తుంది.

## కన్య



శారీరక శ్రమ అధికం. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. రుణాలు చేస్తారు. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. వాహన యోగం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. ఖర్చులు అధికంగా వుంటాయి.

## తుల



కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలకు ఆస్కారం. చోర భయం పొంచి వుంది కనుక అప్రమత్తంగా ఉండండి. వృత్తి ఉద్యోగులకు బాగుంటుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఆకస్మిక ధన లాభం పొందుతారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి.

## వృశ్చికం



వ్యాపారులకు ఆశించిన లాభాలు ఉంటాయి. కుటుంబ గౌరవం పెరుగుతుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. అనుకున్నది సాధించలేకపోవచ్చు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. అనుకోని వార్తలు వింటారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. కళాకారులకు సన్మాన యోగం. స్త్రీలకు శుభ యోగం.

## ధనుస్సు



విద్యార్థులకు శ్రమ అధికం. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. సోమరితనం దరి చేరనివ్వకండి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలకు అవకాశాలున్నాయి. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగంలో ఒడుదుడుకులు ఉంటాయి, సంయమనంతో వుండండి. సాహస యాత్రలు చేస్తారు. ఆదాయానికి తగిన ఖర్చులు ఉంటాయి.

## మకరం



ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఆదాయానికి మించిన ఖర్చులు ఉన్నా సమయస్ఫూర్తితో సర్దుబాటు చేసుకుంటారు. దైవ చింతన అలవడుతుంది. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య సమస్యలు తీరుతాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రముఖులను సందర్శిస్తారు.

## కుంభం



ఆరోగ్య సమస్యలు ఉంటాయి. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి. రుణాలు చేతికంది వస్తాయి. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తి అవుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరడంతో ఊరట లభిస్తుంది. చర్చలు ఫలిస్తాయి.

## మీనం



గృహ సౌఖ్యం. చోర భయం పొంచి వుంది కనుక అప్రమత్తంగా ఉండండి. రుణాలు తీరుస్తారు. స్త్రీల వల్ల సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. అధిక ధనం ఖర్చు చేస్తారు. వ్యాపారాభివృద్ధి ఆశించిన దానికన్నా రెట్టింపు ఫలితాలనిస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. స్త్రీల వల్ల సమస్యలు ఎదురయ్యే సూచనలున్నాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి.

# సెప్టిక్ ట్యాంక్ ఏ దిక్కులో ఉంటే మంచిది?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




విసర్జనీయమైనదాన్ని కూడా శాస్త్రోక్తంగానే విసర్జించాలని, చిన్నచూపు కూడదని నానుడి. డ్రైనేజి ప్రవాహాలు కూడా జలప్రవాహాలుగానే భావించాలి. ఏ దిక్కున వున్న సెప్టిక్ ట్యాంక్స్ ఏ విధమైన శుభా శుభ ఫలితాలనిస్తాయో తెలుసుకుంటే శుభాలను ఆహ్వానించి అశుభాలను విసర్జించవచ్చు.

### ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఈశాన్యంలో గొయ్యి ఉండవచ్చు కదా అనుకుని సెప్టిక్ ట్యాంక్ కోసం గొయ్యి తవ్వడం దోషం కాదనుకుంటారు. ఈశాన్యమూలలో సెప్టిక్ ట్యాంక్ నిర్మించడం వల్ల సత్ఫలితాలుండవు. ఆ ఇంటి ఈశాన్య మూల నుండి స్థల ఈశాన్య మూల వరకు తాడు పట్టి లాగి చూస్తే అది సెప్టిక్ ట్యాంక్ మీదుగా పోతుంది. ఈ దోషం కూడా కూడితే



చెడు ప్రభావం అధికమవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** అనేక విధాలుగా చెడు ఫలితాలుంటాయి.

### Septic Tank in the North-East-Unfavourable

As a hollow pit in the North-East is not unfavourable, it is often believed that digging for a septic tank in the North-East is not harmful. However, constructing a septic tank in the North-East does not fetch any favourable result. If a line is drawn from the North-East corner of the house to the North-East corner of the plot, it will be seen that it passes over the septic tank. This is a flaw that increases the harmful effect.

**Result:** Several kinds of harmful effects.

### ఉత్తర ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఉత్తర ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంక్ ఉండకూడదు. ఇంటి తూర్పు పారు నుండిగానీ, ఈశాన్యం నుండిగానీ పోట్లు లేకపోయినప్పటికీ ఉత్తర ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంక్ మంచి ఫలితాలనివ్వదు.

**శుభా శుభ ఫలితాలు:** ఆర్థిక ఇబ్బందులు, అసౌఖ్యం.

### Septic Tank in the North North-East-unfavourable

Septic tanks should not be constructed in the North North-East. Unless there is a strike from the Eastern border or from the North East of the house, a septic tank constructed in the North North-East does not give any favourable result.

**Result:** Monetary difficulties and unhappiness.

### ఉత్తర/ఉత్తర ఈశాన్య సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటి తూర్పు పారు నుండి ఉత్తర ప్రహరీగోడకు నేరుగా తాడు పట్టి లాగినప్పుడు మధ్యలో బావి వచ్చినట్లయితే అది, ఉత్తర/ఉత్తర ఈశాన్య సెప్టిక్ ట్యాంక్‌పోటు అవుతుంది. ఉత్తరంలో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చు, కానీ ఇలా పోటు వచ్చేలా ఉండకూడదు.

**శుభా శుభ ఫలితాలు:** ఆర్థిక బాధలు, మనోరుగ్మతలకు అవకాశం.

### Septic Tank in the North North-East(Strike)-Unfavourable

If a string, held straight from the Eastern border of the house to the Northern compound wall, encounters a well then it becomes a strike to the North North-East Septic Tank. There can be a septic tank in the North, but it should not give rise to such strike.

**Result:** Monetary troubles and likelihood of psychic illness.

### ఉత్తరం(ఉచ్ఛస్థానం)లో సెప్టిక్ ట్యాంక్-అశుభం

మధ్య ఉత్తరంలో కాక ఈశాన్యం వైపు అంటే ఉచ్ఛస్థానం వైపు ఇంటి నుండి పోటు లేకుండా ఉత్తరంలో సెప్టిక్ ట్యాంక్ తవ్వినట్లయితే అది ఉత్తరం (ఉచ్ఛమం)లో సెప్టిక్ ట్యాంక్ అవుతుంది. ఇటువంటి సెప్టిక్ ట్యాంక్‌లో నుండి ఓవర్ ఫ్లో తూర్పు ఉత్తరాలకు ఉంటే సత్ఫలితాలు ఇనుమడిస్తాయి.

**శుభా శుభ ఫలితాలు:** ధనార్జన, పలుకుబడి, పిసినారితనం.

### Septic Tank in the North(High-grade location)-Favourable


If a septic tank is dug in the middle of the North or towards the North-East, i.e. towards a high-grade location, without giving rise to a strike, it becomes a septic tank in the North (High grade location).

If the overflow from such tank is towards the East or the North then the gainful effect get multiplied.

**Result:** Good earnings, good influence and eccentric behaiour.

# పదరంగం-5

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1) మన అభిమాన దినపత్రిక (2)
2) జంట గ్రహాలు (6)
7) ప్రహ్లాదుని తండ్రి (7)
8) మంచాలు, కుర్చీలలో ఉండి కుట్టేది (2)
9) పసిపిల్లల ఆహారం (2)
10) వానదేవుడు (4)
12) బోలు, డొల్ల (2)
13) కోయిల దీనిని తిని కూస్తుందిట (5)
16) ఖాతా, లెక్క (2)
19) యోగక్షేమాలు(వాడుక భాషలో) (6)
20) సన్మాలలో కప్పేది (3)
21) వేగులవానికి తోక తెగింది (3)
22) శవాలను పీక్కుతినేది (3)
23) ఓర్వలేనితనం (2)


### అడ్డం

1) జనసేనాని పవన్‌కళ్యాణ్ వాహనం పేరు (3)
3) చాళుక్యరాజ వంశస్థాపకుడు మొదటి....చెదరిపోయాడు (4)
4) నాలుగో వంతు పైకొచ్చింది (2)
5) అడవిలో ఉండే జంతువులు(న బదులు ఐ) (5)
6) దీనికి 9 అడ్డం ఇష్టం (2)
8) ముగ్గురి కంటే ఎక్కువ, ఐదుగురి కంటే తక్కువ(4)
10) సృష్టికి ముందు విష్ణువు ఇలా ఉంటాడట (6)
11) పైకి వచ్చిన నిప్పు (2)
14) విజ్ఞాపనలు (4)
15) ఆడపిల్లలు ఆడు వంటకపు ఆటలు (5)
17) గొడవ (2)
18) ద్వైత సిద్ధాంత కర్త (4)
19) పనీపాటా లేకుండా తిరిగేవాడిని ఇలా అనడం రివాజు (3)


## పదరంగం-3 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ[1] | గం | తే[2] | కు | డు[3] | | | పు[4] | లిం | తా[5] |
| ద | | గు | | ఏ[6] | క | శి | లా | | మ |
| రా[7] | టం | డు | | ల | | | కి | | ర |
| టా | | న[8] | మ్మ | క | స్తు | డు[9] | | ఉ[10] | తం |
| ద[11] | ద్ధ | మ్మ | | వ్య | | కు[12] | ళ్ళు | | ప |
| రా | | | ధ[13] | | హు[14] | కుం | | అ[15] | ర |
| | అ[16] | మ | రా | వ | తి | | | చ్చు | |
| తా[17] | | | వ | | ఆ[18] | స్వం[19] | ల | | తే[20] |
| మ[21] | ర | మ్మ[22] | తు | లు[23] | | హ | | పే[24] | రు |
| ర | | టో | | పా[25] | ద | ర | క్ష | లు | |


ఈ వారం కా'ర్టూన్స్'



మత్స్యయంత్రం కొట్టుట కాదు.. మా పుర వీధుల్లో...
"ఇంటి దగ్గరే స్టవ్వులు రిపేర్ చేస్తాం" అంటూ
అరుస్తూ ద్విచక్ర వాహనం పై వేగంగా వెళ్ళే
వాడిని పట్టుకుంటే చాలు..యువరాణి మీదే...
రిజిస్ట్రేషన్స్
మహా స్వయంవరం
Zakir...

అద్దదిగో.. అక్కడుంది
నా ఓటు...

మీరు ప్రారంభించిన ఆటని షాపు నష్టం వచ్చిందట...
మీ హస్తవాసి మంచిది కాదట.. ఆ నష్టం మీరివ్వాలట..!!
Zakir...



బ్రెజిల్-అర్జెంటీనాల మధ్య ఉన్న ఈ జలపాతాన్ని ‘ఇవాజు’ జలపాతం అంటారు. ఎనభై అడుగుల ఎత్తులో ఉన్న ఈ వాటర్ ఫాల్స్‌ని వంతెన పైనుంచి సైతం చూడవచ్చు. జలపాతం హోరు చాలా భయంకరంగా ఉంటుందట. అందువల్ల దీనికి ‘దెయ్యం గొంతు’ జలపాతం అనే పేరు కూడా ఉంది. పేరేదైతేనేం... దీనిని సందర్శించడానికి వెళ్లే పర్యాటకుల సంఖ్య అధికంగానే ఉంటుంది.











